ప్రజాశక్తి

గురువారం 3 ఏప్రిల్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

నిరుపేదలు 1.20 లక్షల మంది

ప్రభుత్వానికి గుంటూరు జిల్లా అధికారుల నివేదిక - పి-4 ద్వారా దాతల నుంచి చేయూతకు ప్రయత్నాలు



పి4 సర్వేలో సిబ్బంది

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పి-4 సర్వేలో జిల్లాలో లక్షా 20 వేల మంది నిరుపేదలున్నట్టు గుర్తించారు. ఈ మేరకు నివేదికను ప్రభుత్వానికి పంపారు. గత నెల 8 నుంచి ఇందుకు సంబంధించిన సర్వేను ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి అత్యంత నిరుపేదలుగా ఉన్న 20 శాతం మందిని గుర్తించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఇందులో భాగంగా జిల్లాలోని గుంటూరు పశ్చిమ, తూర్పు, మంగళగిరి, ప్రత్తిపాడు, పొన్నూరు, తెనాలి, తాడికొండ నియోజకవర్గాలలోని 568 సచివాలయాల పరిధిలో ఈ సర్వే నిర్వహించారు. ప్రభుత్వమే పేదరికంలో ఉన్న జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాలకు పంపగా సచివాలయాల ఉద్యోగులు వీరి వద్దకు వెళ్లి బయోమెట్రిక్ లేదా ఒటిపి ద్వారా వారు స్థానికంగా ఉంటున్నట్టు గుర్తించారు. జనాభాలో ఉన్న 20 శాతం మంది పేద, నిరుపేదలను గుర్తించి వారిని జనాభాలో 10 శాతం వరకు ధనికులు దత్తత తీసుకుని వారికి వివిధ రూపాల్లో చేయూతను ఇచ్చేందుకు పేదల గుర్తింపు ప్రక్రియను చేపట్టారని అధికారులు తెలిపారు.

ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ఎటువంటి వసతి, సరైన జీవనం లేనివారిని గుర్తించినట్టు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నట్టు తెలుస్తోంది. విద్యుత్ వినియోగం 200 యూనిట్లు లోపున్న వారిలో వారి కుటుంబంలో ఎవరికి గణించదగ్గ ఆదాయం, ఆధార్ లింకుతో పరిశీలిస్తే ఎక్కడా ఎటువంటి ఆదాయం ఉన్నట్టు కన్పించని వారిని అధికారులే గుర్తించి సచివాలయాలకు పంపినట్టు తెలుస్తోంది. పట్టణాల్లో వారి పేరున ట్యాప్ కనెక్షన్లు, పక్కా నివాసం ఉన్నవారిని కూడా అనర్హులుగా తేల్చారు. నెలవారీ విద్యుత్ వినియోగం, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగంతోపాటు ఆదాయ పన్ను, జిఎస్‌సి రిటర్నులు, సొంత ఆస్తి, ఇల్లు, నాలుగు చక్రాల వాహనం, ఆదాయ మార్గాలు అద్దె, వడ్డీ, పింఛన్లు పొందుతున్న వివరాలను

ముందే తెలుసుకున్న ఇందుకు సంబంధించిన డేటాను పొందుపర్చినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దాతల నుంచి వివిధ రూపాల్లో సాయం అందించగలిగితే వారు స్వతంత్ర్యంగా నిలదొక్కుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జిల్లాలో గుర్తించిన 1.20 లక్షల మందికి తగిన చేయూత ఎలా ఇప్పించాలి. వారికి మౌలిక వసతులు కల్పించడం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా శిక్షణ, చిరు వ్యాపారాలకు రుణ సదుపాయం, ఉన్నత చదువులకు తగిన ఆర్థిక సాయం, స్వయం ఉపాధి పథకాలకు ఉన్న అవకాశాలను పరిశీలించడం, ఉద్యోగం సాధించేందుకు తగిన ప్రోత్సాహం, ఉన్న అర్హతలు, వయస్సు, వ్యక్తిగత సామర్థ్యం పరిశీలించి ధనిక వర్గాల నుంచి పూర్తి స్థాయిలో మద్దతు కల్పించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వం నిర్దేశించింది.



గుంటూరులో ధర్నా

12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు చేయాలి

- మరణించిన ఉపాధ్యాయుల వారసులకు ఉద్యోగాలివ్వాలి
- గుంటూరు, పల్నాడు కలెక్టరేట్ల ఎదుట ఫ్యాప్టో నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు తక్షనమే 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) డిమాండ్ చేసింది. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఫ్యాప్టో ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు, పల్నాడు కలెక్టరేట్ల ఎదుట నిరసనలు చేపట్టారు. అనంతరం గుంటూరులో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజకు, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో పల్నాడు జిల్లా కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరేకు వినతిపత్రాలిచ్చారు. గుంటూరులో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ కె.నరసింహారావు, నరసరావుపేటలో పల్నాడు జిల్లా చైర్మన్ ఎల్.వి రామిరెడ్డి మాట్లాడుతూ మరణించిన ఉపాధ్యాయుల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కరోనా సమయంలో మరణించిన ఉపాధ్యాయుల, ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు ఇవ్వనందున ఆ ▶ 2లో



నరసరావుపేటలో ధర్నా



ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న శాసన మండలి చైర్మన్ మోషన్ రాజు

శాసన మండలి సభ్యునిగా

రాజేంద్ర ప్రసాద్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ బుధవారం శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. మోషన్ రాజు ఆయన చేత ప్రమాణం చేయించారు. అనంతరం మండలి నియమ నిబంధనలకు సంబంధించిన పలు డాక్యుమెంట్స్, ఇతర వివరాలను రాజేంద్రప్రసాద్‌కు మోషన్ రాజు అందచేశారు. రాజేంద్ర ప్రసాద్‌కు వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, యార్లగడ్డ వెంకటరావు, కిట్స్ కళాశాల అధినేత సుబ్బారావు, విద్యా సంస్థల నిర్వాహకులు, టిడిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి హామీ పనుల కల్పనలో నిర్లక్ష్యం

- కూలీల వద్దకు వ్యవసాయ కార్మిక సంఘం బైక్ యాత్ర
- సమస్యలపై డిఆర్‌డిఎ పీడీకి శనివారం నివేదన

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న నాయకులు



ప్రజాశక్తి - అచ్చంపేట

ఉపాధి హామీ కూలీల సమస్యపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం అచ్చంపేటలో బైక్ యాత్ర నిర్వహించారు. వీరభద్ర కాలనీలో ఉపాధి హామీ కూలీలతో సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడారు. జిల్లాలో 5 లక్షల 84 వేల 68 జాబ్ కార్డులుండగా ఇందులో 11 లక్షల 97 వేల 357 మంది కూలీలున్నారని చెప్పారు. వీరిలో ▶ 2లో

గుంటూరు యార్డులో రేపు మిర్చి రైతుల ధర్నా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మిర్చి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరుతూ రైతు, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో గుంటూరు మిర్చి యార్డులో శుక్రవారం చేపట్టే ధర్నాకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మిర్చిరైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని కౌలురైతు సంఘం పల్నాడు కార్యదర్శి వై.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. నరసరావుపేట కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మిర్చి పైరుకు చీడ, పీడలు, తెగుళ్ల బెడదతో ఆశించిన దిగుబడులు రాలేదని చెప్పారు. కనీస మద్దతు ధర అమలు చేసి ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఆ బాధ్యతనూ విస్మరించి రైతుల్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.11781 ధర రైతులకు ఏ మాత్రమూ గిట్టుబాటు కాదన్నారు. ఎరువులు, విత్తనాలు, కౌలు ఇతర ఖర్చులలో సంబంధం లేకుండా కేవలం క్వింటాళ్ మిర్చి కోత కూలి, గ్రేడింగ్‌కు రూ.8 వేలు ఖర్చవుతుందన్నారు. ఈ నేపథ్యంలో కనీసం ▶ 2లో



స్వాధీనం చేసుకున్న ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, ఎఎస్‌పి, తదితరులు

ఆధారాల్లేకుండా స్నాచింగులు..

ఎట్టకేలకు పట్టుకున్న పోలీసులు

ఇద్దరు అరెస్టు - రూ.32 లక్షల ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మహిళల మెడల్లో గొలుసు చోరీలకు పాల్పడుతున్న ఇద్దర్ని పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.32 లక్షల విలువైన 390 గ్రాముల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను గుంటూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ బుధవారం వెల్లడించారు. నిందితుల్లో ఒకరు ఆటో డ్రైవర్, మరొకరు టైలర్ అని, వీరు 2022 నుంచి వరసుగా ఏటా రెండు మూడు చోరీలకు పాల్పడగా 2024లో ఏకంగా ఐదారు ▶ 2లో

వర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్‌గా రవికృష్ణ

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి నూతన ఫైనాన్స్ ఆఫీసర్‌గా స్టేట్ ఆడిట్ డిపార్ట్మెంట్‌లో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న వి.రవికృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఇన్‌ఛార్జి వీసీ కె.గంగాధరరావును, ఇన్‌ఛార్జి రెక్టార్, కె.రత్నషీలామణి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ జి.సింహాచలంను బుధవారం కలిశారు.



ఆధారాల్లేకుండా రూములివ్వొద్దు

లాడ్జి, హోటళ్ల నిర్వాహకులతో పోలీసుల సమావేశం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో హోటల్స్, లాడ్జీల నిర్వాహకులతో త్రీటౌన్ సిఐ ఎస్.రమేష్‌బాబు బుధవారం సమావేశమయ్యారు. పోలీసుల అనుమతి లేకుండా మైనర్లకు రూములు కేటాయించొద్దన్నారు. లాడ్జిలో బస చేసే వారి వివరాలు పూర్తిగా నమోదు చేయాలని, అడ్రస్ వివరాలు, తగిన ఆధారాలను పూర్తిగా సేకరించాలని చెప్పారు. సందర్శకుల రాకపోకల వివరాలు నమోదుకు కచ్చితంగా ఒక రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. సిసి కెమెరాలు విధిగా ఏర్పాటు చేయాలని చెప్పారు. బెట్టింగులు, ఇతర అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించొద్దని, బస చేసే వారిపై అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

ఉపాధి హామీ పనుల కల్పనలో నిర్లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

756 కుటుంబాలు మాత్రమే వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకుంటున్నాయని, మిగతా వారికి పనులు సరిగా చూపడం లేదని అన్నారు. కూలి సైతం సకాలంలో చెల్లించడం లేదన్నారు. పనుల కల్పనలో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. పని ప్రదేశాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. 100 రోజులు పని పూర్తి చేసుకున్న వారికి పనిదినాలు పెంచాలని, సమ్మర్ అలవెన్స్, పనిముట్లు, తాగునీరు, మజ్జిగ అలవెన్స్ ఇవ్వాలని కోరారు. పనుల కల్పనలో రాజకీయ నాయకులు జోక్యం లేకుండా చూడాలని, వివక్ష పాటించకుండా అందరికీ పనులు చూపాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై నరసరావుపేటలోని డిఆర్‌డిఎ కార్యాలయంలో పీడీకికి శనివారం నివేదిస్తామని, మేట్‌లు, కూలీలు హాజరవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టి.హనుమంతరావు, వై.వెంకటేశ్వర్లు, జె.భగత్‌సింగ్ పాల్గొన్నారు.

గుంటూరు యార్డులో రేపు మిర్చి రైతుల ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

రూ.15 వేల చొప్పున ధరకు ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 2 నెలల క్రితం ప్రైవేటు వ్యక్తులకు తక్కువ ధరకు అమ్ముకున్న రైతులకు రూ.5 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇంకా ఇవ్వలేదన్నారు. ధరల స్థిరీకరణ నిధికి ప్రభుత్వం కేటాయించిన రూ.300 కోట్లు ఏ మాత్రమూ సరిపోదని, రూ.5 వేల కోట్లకు పెంచాలని కోరారు. మిర్చి ఎగుమతులకు ఉన్న అవకాశాలను ప్రభుత్వాలు పరిశీలించి సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. కౌల్దార్లను గ్రామాల వారీగా గుర్తించి స్థానికంగానే గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు.

ఘనంగా శ్రీ చౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్ల

ప్రజాశక్తి-ఈపూరు : ఎ.ముప్పాళ్లలోని శ్రీ చౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్లను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు భార్య లీలావతి హాజరయ్యారు. రెండు భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఖాళీలు లేవనే పేరుతో కాలయాపన చేయడం సరికాదని అన్నారు. వెంటనే కలెక్టర్ పూల్‌లో వారికి కారుణ్య నియామకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 12వ వేతన సవరణ కాలం ఇప్పటికే 21 నెలలు గడిచిపోయినా కనీసం కమిషన్‌ను కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. వెంటనే కమిషన్‌ను ఏర్పాటు చేసి 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలనేది లక్షలాది ఉద్యోగుల, ఉపాధ్యాయుల ఆకాంక్ష అని, కానీ పాలకులు ఆదిశగా అడుగులు వేయట్లేదని అన్నారు. ఫ్యాప్టో గుంటూరు, పల్నాడు జిల్లాల సెక్రటరీ జనరల్స్ కె.వీరాంజనేయులు, బి.సంపత్‌బాబు మాట్లాడుతూ కనీసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నంబర్ 57ను అమలు చేయలేదన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులను పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర మాజీ చైర్మన్ సి.హెచ్. సుధీర్‌బాబు, జిల్లా అడిషనల్ సెక్రటరీ జనరల్ యు.రాజశేఖరరావు, కార్యవర్గ సభ్యులు కె.బసవలింగారావు మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు చేయని కారణంగా ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈఓ, డైట్ ప్రిన్సిపాల్, డీఈవో పోస్టులు అందని ద్రాక్షలా మిగిలిపోయాయని, వెంటనే జీవో నం. 73, 74, 75 అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగు మీడియంను కనీసం సమాంతర మీడియంగానైనా అమలు చేయాలని, 3 డిఎ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, సరెండర్ లీవ్ బకాయిలను, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ను, డిఎ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో గుంటూరు జిల్లా కో-చైర్మన్ షేక్ ఫైజుల్లా, పల్నాడు జిల్లా కో-చైర్మన్ ఎం.మోహనరావు, గుటూరు జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ డి.కె.సుబ్బారెడ్డి, మహమ్మద్ ఖలీద్, ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సభ్యులు కళాధర్, ఎస్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్.రామచంద్రయ్య, యుటిఎఫ్ సీనియర్ నాయకులు హనుమంతరావు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కరిముల్లా, జిల్లా అధ్యక్షులు సిహెచ్.కొండయ్య, పల్నాడు జిల్లా నాయకులు వి.అశోక్ కుమార్, టి.చంద్రయ్య, ఎస్‌కె మొహిద్దిన్‌బాషా, ఎఎండి ఉస్మాన్, ఆర్.గోవిందరాజులు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


పల్నాడు జెసికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పారిశుధ్య పనుల్లో పర్యవేక్షణ లోపం : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు


సమీక్ష సమావేశంలో కమిషనర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

పారిశుధ్య పనులు సమర్ధవంతంగా నిర్వహించడంలో సెక్రటరీలు, ఇన్‌స్పెక్టర్, ఎస్ఎస్‌ల పర్యవేక్షణ లోపం ఉందని నగర కమిషనర్ పి.శ్రీనివాసులు అన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో కలిసి జిఎంసి కౌన్సిల్ హాల్లో పారిశుధ్యంపై బుధవారం నిర్వహించిన సమీక్షలో కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగైన పర్యవేక్షణ కోసం శానిటరీ డివిజన్లను 32కు పెంచటంతో పాటు అవసరమైన పుష్ కాట్స్, ప్లాస్టిక్ బిన్స్, ఆటోలు, ట్రాక్టర్లు, అదనపు కార్మికులను కేటాయించినప్పటికీ పనుల్లో లోపం జరుగుతోందన్నారు. నిర్లక్ష్యంగా ఉండేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉగాది, రంజాన్ వంటి పెద్ద పండుగల సమయాల్లోనూ తూర్పు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో పారిశుధ్యం సరిగా లేదన్నారు. కార్మికులు, సెక్రటరీలు నిర్దేశిత సమయంలో విధుల్లో ఉండట్లేదని, ప్రతిరోజూ ఇంటి నుండి చెత్త సేకరణ చేయట్లేదని, ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. ప్రతి డివిజన్లో అందరికీ కనిపించేలా శానిటరీ సెక్రటరీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల, ఎస్ఎస్‌ల ఫోన్ నంబర్లను ప్రదర్శించాలన్నారు. సమావేశంలో సిఎంహెచ్‌ఓ డాక్టర్ అమతం, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, ఈఈ సుందర రామిరెడ్డి, వెహికల్ షెడ్ డిఇఇ పాల్గొన్నారు.

రుణమేళాకు 470 మంది హాజరు

ప్రజాశక్తి - మాచర్ల

స్వయం ఉపాధి కల్పనలో భాగంగా ప్రభుత్వం యాభై శాతం సబ్సిడీ రుణాలు అందిస్తుందని, ఈ రుణాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ వేణుబాబులు లబ్దిదారులకు సూచించారు. స్వయం ఉపాధి కల్పనలో భాగంగా బి.సి, ఈబిసీ, కాపు, జనరిక్ ఫార్మసీ లబ్దిదారులకు మాచర్ల మున్సిపల్ కార్యాలయం నందు బుధవారం రుణ అర్హత మేళా నిర్వహించారు. మొత్తం 57 యూనిట్లుకు గాను 830 మంది ధరఖాస్తుదారులు ఆన్‌లైన్ చేసుకోగా 470 మంది మాత్రమే క్రెడిట్ క్యాంపుకు హాజరయ్యారు. వీరి ధరఖాస్తులను వివిధ బ్యాంకుల బ్రాంచి మేనేజర్లు, సెలక్షన్ కమిటీ సభ్యులు పరిశీలించి, లబ్దిదారులను ఎంపిక చేయడం జరుగుతుంది. క్రెడిట్‌క్యాంప్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్,మేనేజరులు, మున్సిపల్ చైర్మన్ పోలూరు నరసింహారావు, కమిషనర్ వేణుబాబు, మెప్మా అధికారులు శ్యామలా దేవి, రాజశేఖర్, అంజలి పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని విద్యాసంస్థల్లో 5వ తరగతిలో ప్రవేశాలు, 6, 7, 8 గురుకుల పాఠశాలల్లో తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీలకు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లోని మొదటి సంవత్సరం సీట్ల భర్తీకి నిర్వహించే ప్రవేశ పరీక్షల దరఖాస్తుల స్వీకరణ గడువును 6వ తేదీ వరకు పొడిగించినట్లు, ఏ.పి.ఆర్. జె.సి. ప్రిన్సిపాల్ సరోజిని తెలిపారు. విద్యార్థులు https://aprs. apcoss.in ద్వారా ఆన్లైన్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఈమెయిల్ పోస్ట్ ద్వారా పంపించే దరఖాస్తులను పరిశీలించబోమని తెలిపారు.

ఆధారాల్లేకుండా స్నాచింగులు..

(మొదటి పేజీ తరువాయి)

చోరీలకు పాల్పడ్డారని, ఆధారాలేమీ లేకుండా జాగ్రత్త పడుతున్న వీరిని ఎట్టకేలకు పట్టుకున్నామని ఎస్పీ తెలిపారు.

ఏటుకూరుకు డిఎస్ నగర్ 9వ లైనుకు చెందిన టైలర్ పల్లెపు శ్రీనుకు, 2009లో చీరాల నుండి వచ్చి గుంటూరు వసంతరాయపురం ప్రాంతంలో ఉంటున్న ఆటో డ్రైవర్ అన్నపురెడ్డి శివసుబ్రమణ్యంకు 2018లో సినిమాకు వెళ్లిన సందర్భంలో పరిచయం ఏర్పడింది. అనంతరం ఇద్దరూ కలిసి చోరీలకు పాల్పడడం మొదలుపెట్టారు. 13 సందర్భాల్లో 420 గ్రాముల బంగారు ఆభరణాలను వీరు చోరీ చేశారు. ప్రధానంగా సాయంత్రం వేళ రోడ్డుపై నడిచి వెళ్తున్న మహిళల నుంచి ఆభరణాలను లాక్కెళ్తారు. ద్విచక్ర వాహనంపై ఒకరు దొంగతనం చేస్తుండగా మరొకరు బండి వేగంగా నడుపుతుంటారు. ఇటీవల నల్లపాడు పోలీసుస్టేషన్ పరిధిలోని లింగాయపాలెంలో నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని గొలుసును దొంగతనం చేయగా బాధితుల ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు. ఆయా ప్రాంతలోని సిసి కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించగా నిందితులెవరో పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అనంతరం వారిని విచారణ చేయగా గతంలోనూ వారు చేసిన చోరీలను అంగీకరించారు. పట్టాభిపురం 2, నల్లపాడు 4, అరండల్ పేట 1, తెనాలి వన్ టౌన్ 2, తెనాలి త్రీ టౌన్ 1, తెనాలి రూరల్ 1, బాపట్ల జిల్లాలోని చీరాల టూ టౌన్ 1, చీరాల త్రీ టౌన్ 1 చొప్పున మొత్తం 13 చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినా ఎక్కడా కేసు నమోదు కాలేని విధంగా ఆధారాలు దొరక్కుండా జాగ్రత్త పడ్డారని ఎస్పీ వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి సుప్రజ, ట్రైనీ ఐపిఎస్ అధికారి దీక్ష, దక్షిణ డిఎస్‌పి భానోదయ, నల్లపాడు సిఐ వంశీధర్ పాల్గొన్నారు.



జగన్ దుష్ప్రచారం : వర్ల రామయ్య

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కూటమి ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. బుధవారం నరసరావుపేటలోని నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లుకు టిడిపి మద్దతు ప్రకటించటంపై వైసిపి అనవసర రాద్ధాంతం చేస్తుందని అన్నారు. సవరణ బిల్లులో 4 అంశాలకు గాను 3 అంశాలకు టిడిపి మద్దతు ఇచ్చిందన్నారు. వక్ఫ్ బోర్డ్‌లో ముస్లిమేతరులను చేర్చటం అనే 4వ అంశాన్ని టిడిపి వ్యతిరేకిస్తుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ముస్లిమ్ మైనారిటీల అభివృద్ధి గురించి ఎన్నడూ మాట్లాడని జగన్మోహన్ రెడ్డి నేడు కపట ప్రేమ చూపుతున్నారని అన్నారు. 5 ఏళ్ల వైసిపి పాలనలో ముస్లిముల అభివద్ధికి ఏం చేశారో బహిరంగంగా చెప్పాలన్నారు. పార్లమెంటులో బిల్లు ఆమోదానికి బిజెపికి స్పష్టమైన ఆధిక్యత ఉందన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు మద్దతు ఇవ్వనంత మాత్రాన పార్లమెంటులో ఆ బిల్లు ఆమోదం ఆగదని అన్నారు.

మహిళల భద్రత కోసం శక్తి యాప్

ప్రజాశక్తి - నకరికల్లు

మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి యాప్‌పై అవగాహన సదస్సును నకరికల్లు కస్తూర్బా గురుకుల పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుభాషిణి హాజరై మాట్లాడారు. మహిళలు, ఆడ పిల్లలు భద్రత గురించి అవగాహన కల్పించారు. ఏదైనా భద్రతా పరమైన ఇబ్బందులు వచ్చినప్పుడు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లతోపాటు శక్తి యాప్‌ను ఉపయోగించి ఎలా రక్షణ పొందాలో వివరించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సై సంధ్యారాణి, సిహెచ్ సురేష్, అంగన్వాడి టీచర్లు సచివాలయ మహిళా సిబ్బంది ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మంత్రిగారూ! ఇదేమిటి సారూ?

ఇళ్లకు పట్టాలిచ్చి, రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి- తాడేపల్లి

ఈ నెల నాలుగో తేదీ నుండి నియోజకవర్గంలో మూడు వేల మందికి ఇళ్ల పట్టాలు ఇస్తామని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. ఆమేరకు అధికారు లు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గంలో సుమారు 22,000 మంది ఇళ్ల పట్టాలు మరియు రిజిస్ట్రేషన్ సౌకర్యం కోసం ఎదురుచూస్తున్నారని సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు తెలిపారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు తాను గెలిస్తే అందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వడంతోపాటు తాడేపల్లి పట్టణంలోని కొండ చుట్టూ ఉన్న ప్రజలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా కల్పిస్తామని హామీ ఇచ్చిన సంగతిని గుర్తు చేశారు. ఇవి గాక రైల్వే స్థలాల్లో గత 40 ఏళ్ల నుండి నివాసం ఉంటున్న పేదలకు కూడా న్యాయం చేస్తానని చెప్పిన విషయాన్ని గమనంలో ఉంచుకొని అందరికీ న్యాయం చేయాలని కోరారు. తాడేపల్లి సుందరయ్య నగర్ లోని పేదల ఇళ్ళను రెగ్యులైజ్ చేస్తామని ఇచ్చిన హామీని మంత్రి లోకేష్ అమలు చేయాలని బూరుగ వెంకటేశ్వర్లు కోరారు.

రిజిస్ట్రేషన్ చేస్తామని... డి.పట్టాలిస్తారా?

ప్రజాశక్తి- తాడేపల్లి

మంగళగిరి నియోజకవర్గ నుండి ఎమ్మెల్యేగా గెలిచి ఆ తర్వాత మంత్రిగా క్యాబినెట్లో నెంబర్ 2గా చలామణి అవుతున్న నారా లోకేష్ గారి మీద నియోజకవర్గ ప్రజలు చాలా ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా తాడేపల్లి పట్టణ ప్రజలు అయితే ఇళ్ల స్థలాలు, ప్రస్తుతం నివాసం ఉంటున్న ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. నేడు అందుకు విరుద్ధంగా ప్రభుత్వం ముందుకు పోతుందని అసంతృప్తి ప్రజల నుండి వ్యక్తం అవుతుంది. రెవెన్యూ భూములు డిపార్ట్మెంట్, జీవో ఎంఎస్ నెంబర్ 30 ఇటీవల ప్రభుత్వం వెలువరించింది. అందులో 150 గజాలు లోపు ఉన్న ఇంటి స్థలాలను ఫ్రీ రెగ్యులైజేషన్ చేసి రిజిస్ట్రేషన్ పట్టాలిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం డి పట్టా ఇస్తామని జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. గత 30 ఏళ్ల నుండి అనేక పార్టీలు అధికా రంలో ఉన్నాయి. సిపిఎం, కాంగ్రెస్, తెలుగుదేశం అధికా రంలో ఉన్న సమయంలో పాలకంపాడు, సంజీవ్ నగర్ ప్రాంతాల్లో డి పట్టాలు ప్రభుత్వ అధికారులతో పంపిణీ చేయించారు. మరలా ఇప్పుడు డి పట్టాలు ఇస్తామనటంలో అర్థం లేదని స్థానికులు పెదవిరుస్తున్నారు. తాము నివాసం ఉంటున్న ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తే, కుటుంబ అవసరాలకు, వ్యాపారాలు నిర్వహించుకునేందుకు బ్యాంకుల ద్వారా లోన్లు తీసుకుందామని అనేకమంది ఆశతో ఉన్నారు, ప్రభుత్వం డి పట్టాలిస్తామని చెప్పటంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 150 గజాలు దాటిన తర్వాత ఎన్ని గజాలు



పేదలు నివసిస్తున్న ప్రాంతం

ఉంటే అన్ని గజాలకు ప్రభుత్వ వ్యాల్యూయేషన్ ప్రకారం 15 శాతం ప్రభుత్వానికి ఫీజు చెల్లించాలని షరతు విధించారు. తాడేపల్లి పట్టణంలోని పాలకంపాడులో గజం రూ.12 వేలు ఉంది. ఈ లెక్క ప్రకారం 300 గజాలు స్థలం ఉన్న యజమాని 150 గజాలకే కాకుండా 300 గజాలకు 15శాతం చొప్పున రూ5.40 లక్షలు చెల్లించాల్సి వస్తుంది. ఇందులో 50శాతం రిజిస్టర్ ఆఫీసులో కట్టాల్సి ఉంటుందని అందులో పేర్కొన్నారు. పోలకంపాడు అంకమ్మ గుడి ముగ్గురోడ్డు వరకు సుమారు 600 ఇళ్లు పేద, మధ్యతరగతి ప్రజలు వేసుకొని నివాసాలు ఉంటున్నారు. ప్రభుత్వం మారితే తమకు, ఉంటున్న ఇళ్లకు ఇళ్ల పట్టాలు ఉచితంగా వస్తాయని భావించిన స్థల, యజమానులు ప్రభుత్వం పెట్టిన నిబంధనలతో అంత డబ్బులు ఎలా చెల్లించాలని తల పట్టుకున్నారు. దీనిపై ప్రభుత్వం ఆలోచించి పేదలకు ఎటువంటి భారం లేకుండా ఫ్రీగా రెగ్యులైజేషన్ చేయాలని, సౌకర్యం కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రైల్వే ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

రైల్వే శాఖలో ఉద్యోగాలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు రామ్‌కి ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ల్యాండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు ఎం.వి రామిరెడ్డి, గద్దె భాస్కర్, ప్రొఫెసర్ లక్ష్మి కుమారి ఒక ప్రకటనలో తెలియజేశారు. రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు గ్రూప్ డి పరీక్షల ద్వారా ఖాళీలు భర్తీ చేయనున్న నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఇదొక సువర్ణ అవకాశమన్నారు. ఈనెల 5న రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాలలో అర్హత పరీక్ష నిర్వహించనున్నామని, విజయం సాధించిన అభ్యర్థులకు శ్రీధర్ సిసిఎఫ్ సంస్థ నేతత్వంలో మూడు నాలుగు నెలల పాటు హైదరాబాదులో ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. అర్హత సాధించిన అభ్యర్థులకు శిక్షణతో పాటు వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, కర్నూల్ నగరాల్లో వంద మార్కులకు నిర్వహించే అర్హత పరీక్షలను 90 నిమిషాలలో రాయాల్సి ఉంటుందని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ టెలిగ్రామ్ గ్రూపును కూడా ఫాలో కావచ్చని తెలియజేశారు. అదనపు వివరాల కోసం 98667 77870 నంబరులో సంప్రదించాలని సూచించారు.



1998 డీఎస్సీ క్వాలిఫైడ్ మిగిలిన అభ్యర్థులకు వెంటనే నియామకాలు చేపట్టాలని నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి

1998 డీఎస్సీ క్వాలిఫైడ్ మిగిలిన అభ్యర్థులకు వెంటనే ఎంటిఎస్ పద్ధతిలో ఎస్జీటీలుగా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం 1998 డీఎస్సీ మిగిలిపోయిన క్యాండిడేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఓబిసి నేషనల్ అధ్యక్షులు ఏ వరప్రసాద్ మాట్లాడుతూ గత 27 సంవత్సరాల నుండి ఆందోళన చేస్తున్నారని వారి సమస్యను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి క్వాలిఫైడ్ అయ్యి మిగిలిన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 2023 లో గత ప్రభుత్వం ఓపెన్ మెరిట్, క్యారీ ఫార్వర్డ్ ద్వారా నియామకాలు చేపట్టడం వలన కర్నూలు, కడప, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ, హ్యాండీక్యాప్డ్, మహిళల అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు పూర్తికావస్తున్న ఇంతవరకు ఎటువంటి స్పందన లేదని అన్నారు. ఎనిమిది జిల్లాల్లో 1500 మంది అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఈ శ్రీనివాసులు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ న్యాయం చేయకపోతే ఆత్మహత్యలేచరణీయమని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ మేరీ సుహాసిని, జగ్గయ్య, చంద్రయ్య, రత్నబాబు, రామారావు, గోవిందరావు, మీరావాలి, జి రమణ, జయ రామయ్యలు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సిఐడి విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఇరు తెలుగు రాష్ట్రాలలో సంచలనమైన ప్రముఖ దైవసేవకులు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి నిరసనగా పలు క్రిస్టియన్ సంఘాలు తెనాలిలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. స్థానిక చెంచుపేట ఉమేష్ చంద్ర విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీలో నియోజకవర్గ స్తాయిలో క్రైస్తవ సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొన్నాయి. చెంచుపేట, మార్కెట్ సెంటర్, బస్టాండ్, గంగానమ్మపేట, రజక చెరువు, గాంధీ చౌక్, టౌన్ చర్చి మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగింది. ప్రవీణ్ పగడాల మృతికి సంబంధించి సిఐడి కమిటి వేసి కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ వి సంజన సింహకు బుధవారం వినతి పత్రం సమర్పించారు. స్వీకరించిన వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం ఏర్పాటుచేసిన పత్రికా సమావేశంలో తొలుత తెనాలి పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బిషప్ కూచిపూడి అబ్రహం మాట్లాడుతూ క్రైస్తవ్యం అనేది ఒక మతం కాదని మార్గమని చెప్పారు. దైవసేవకులపై చేస్తున్న దాడులను, హత్యలను పాస్టర్ల సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. ప్రపంచ శాంతిని కాంక్షించే క్రైస్తవులు, దైవ సేవకులపై జరుగుతున్న దాడులు అన్యాయమన్నారు. పాస్టర్లపై భౌతిక దాడులకు తెగపడుతున్న సంఘ విద్రోహులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈరే మినిస్ట్రీస్ అధినేత బిషప్ కె సుధీర్ కుమార్ మాట్లాడుతూ రెండు రాష్ట్రాల క్రైస్తవులు రోడ్డుపైకి రావాల్సిన పరిస్థితి నెలకొందని, సిఐడి కమిటి ద్వారా ప్రవీణ్ పగడాల మృతి వెనుక మిస్టరీ ఛేదించాలని కోరారు. సోషల్ మీడియాలో వస్తున్న విభిన్న కథనాలను నమ్మొద్దని, వాస్తవ ఘటనలో సత్యాసత్యాలు పోలీసుల విచారణలో వెల్లడౌతాయని ఎస్సి, ఎస్టి, బిసి మైనారిటి సంఘాల అధ్యక్షులు అక్కిదాసు కిరణ్ కుమార్ చెప్పారు. దైవ సేవకులపై జరుగుతున్న భౌతిక దాడులపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించా లని డిమాండ్ చేశారు. మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రెవరెండ్ ఎ భాను ప్రసాద్, పాలపర్తి ఐజక్ బిషప్ జాన్ పాల్ బిషప్ పరంజ్యోతి బిషప్ జె ప్రభుదాస్ బ్రదర్స్ సాల్మన్ రెవరెండ్ బి వి సర్వోన్నతరావ్ బ్రదర్ ఆనంద్, మల్లవరపు విజయ్, ఎస్సి, ఎస్,టి అంబేద్కర్ సేవా ట్రస్ట్ అధ్యక్షులు కనపర్తి అబ్రహం లింకన్, ది బుద్దిస్ట్ సొసైటీ జాతీయ అధ్యక్షులు యంద్రపాటి అశోక్ కుమార్, పాస్టర్ జాన్ మోజెస్ తదితరులు పాల్గున్నారు.





ర్యాలీ ప్రదర్శనలో పాస్టర్లు , సబ్ కలెక్టర్ సంజన సింహ కు వినతిపత్రం సమర్పిస్తున్న పాస్టర్లు

Notice
IN THE COURT OF THE I ADDL.DIST.JUDGE:: GUNTUR
M.V.O.P.No.1392/2023

Between:
Shaik Khasim Saida. ... Petitioner
And
S.V.R. Electricals Pvt Ltd, Rep.by it's Madala Venkateswara Rao & Others ..... Respondents

To,
R-2: Umesh Kumar Mishra, S/o.Ram Bahadur Mishra, R/o. Manjhela tikait Nagar, Ramsanehighat, Bara Banki, UP-225 415 Presently R/o. Block No. 42, Plot No. 13, 14,15,25,26,27 IDA, Auto Nagar, Guntur City, Guntur Dist. - 522 001 (Driver of Auto Bearing No. AP39 TX 5968)

పై నెంబరు యం.వి.ఓ.పి.లోని పిటీషనరు యాక్సిడెంటులో తగిలిన గాయములకు నష్టపరిహారం కొరుచూ దాఖలు చేసిన పిటీషనులో 2వ రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:16-04-2025 కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేక మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:16-04-2025

తోట శ్రీనివాసరావు,
మేడగం శ్రీనివాస రెడ్డి,
పిటీషనరు తరపు అడ్వకేట్స్, గుంటూరు.

<u>లీగల్ ప్రకటన</u>
మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం. 198/2023, ఐ.ఎ.నెం. 199/2023, ఐ.ఎ.నెం. 200/2023 ఓ.యస్.నెం. 13/2017

కాకోలు వెంకటేశ్వర్లు ...పిటీషనరు/వాది
వర్సెస్
కొనకంచి వెంకట రాయుడు మరియు వగైరాలు ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

12వ రెస్పాండెంటు / ప్రతివాది:
అన్నప్రగడ శివకుమారి, భర్త హనుమంతరావు, వైకల్లు గ్రామం & మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబరు గల దావాలో ప్రతివాదికి వారసులుగా మిమ్ములను చేర్పించమని పిటీషన్ పెట్టడానికి అయిన ఆలస్యమును క్షమించమని కోరుతూ పై పిటిషన్లు దాఖలు చేసి మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీరు తేది: 23-04-2025న ఉదయం 10-30 గంటలకు శ్రీ కోర్టు వారి యెదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో పిటీషన్లను పరోక్షంగా తీర్మానించబడును.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //

స్థలం: అద్దంకి
తేది: 2-04-2025

గొట్టిపాటి శ్రీనివాసరావు
MA., LLB.,
అడ్వకేట్,
అద్దంకి, ఒంగోలు

నోటీసు
మహారాజశ్రీ గుంటూరు 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
యం.వి.ఓ.పి.నెం.289/2023

బిట్వీన్:
శరణం వెంకట పూర్ణ శరత్ చంద్ర ...పిటీషనరు
మరియు
వెలిశెట్టి శ్రీనివాస రావు వగైరాలు...రెస్పాండెంట్లు

టు,
ఆర్-1: వెలిశెట్టి శ్రీనివాస రావు, తండ్రి.రమణ, నివాస డోర్ నెం.8-10-294, 1వలైను పవర్ బిల్డింగ్ ఆఫీసర్స్, నెహ్రూ నగర్, గుంటూరు సిటీ మరియు జిల్లా.
(రాయల్ ఎన్ ఫీల్డ్ మోటార్ సైకిల్ ఓనర్, నెం.AP 20 AP 5004)

పై నెంబరు యం.వి.ఓ.పి.లోని పిటీషనరు యాక్సిడెంటులో తగిలిన గాయములకు నష్టపరిహారం కొరుచూ దాఖలు చేసిన పిటీషనులో 1వ రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:21-04-2025 కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేక మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:21-04-2025

తోట శ్రీనివాస రావు,
పిటీషనరు తరపు అడ్వకేట్, గుంటూరు.

నోటీసు
మహారాజశ్రీ గుంటూరు 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
యం.వి.ఓ.పి.నెం.136/2021

బిట్వీన్:
తన్నీరు ఆంజనేయులు ....పిటీషనరు
మరియు
షేక్ షరీఫూన్ వగైరా ....రెస్పాండెంట్లు

టు,
ఆర్-2: షేక్ మహబూబ్ జాని,మొహమ్మద్ షరీఫ్, జెండా చెట్టు దగ్గర, ఫిరంగిపురం గ్రామం & మండలం, గుంటూరు జిల్లా.
(మినిలారీ డ్రైవరు,నెం.AP07TF0619)

పై నెంబరు O.Pని పిటీషనరు యాక్సిడెంటులో తగిలిన గాయములకు నష్టపరిహారము కోరుచూ దాఖలు చేయగా సదరు పిటీషనులో 2వ రెస్పాండెంట్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:29-04-2025 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:29-04-2025

కె. శివ ప్రసాద్,
పిటీషనరు తరపు అడ్వకేట్,
గుంటూరు, సెల్: 9848119447

దావా సమన్లు
IN THE COURT OF HON'BLE IIIrd ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) :: GUNTUR.
O.S. NO. 44/2024

Between ::
Karanam Lakshmi Kantha Rao... Plaintiff
And
Pamidi Pamula Raja Rao ..... Defendant

To,
Pamidi Pamula Raja Rao, S/o Raju, aged about 34 years, D. No. 8-28-16, Balajirao Peta, Tenali, Nelapadu, Guntur, Andhra Pradesh - 522202.

పై నెంబర్ దావా లో మహారాజశ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారాను మరియు పోస్ట్ ద్వారాను సమన్లు పంపినను, మీరు కావాలని తీసుకొనక కాలయాపన చేయుచున్న కారణంగా, మీకు సమన్లు నిమిత్తం పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టువారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు ది. 29-04-2025 న ఉదయం గం. 10.30 ని. లకు పై కోర్టు వారి ఎదుట మీరు గాని మీ తరపు ప్లీడర్ గారు గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

వాయిదాతేది:29-04-2025

కోకా విజయ భాస్కర్,
వాది తరపు అడ్వకేట్, గుంటూరు,
సెల్ :90593 97949

కళ్లాల్లో ఆరబోసి ఎదురు చూపులు

- మిర్చి రైతులకు గడ్డుకాలం
- ధర రాక.. అమ్ముకోలేక అవస్థ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వాణిజ్య పంటల సాగులో నియోజకవర్గం రైతులకు పెట్టింది పేరే అయినా ఈ ఏడాది మిర్చి రైతులు కుదేలవుతున్నారు. ఓ వైపు అధిక పెట్టుబడులు, మరోవైపు ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల దాడి చేసినా నానాతంటాలు పడి పంట పండించారు. ప్రస్తుతం పంట చివరి కోతల దశకు చేరింది. గతంలో దిగుబడి 25-30 క్వింటాళ్ళ రాగా ఇప్పుడు 15-17 క్వింటాళ్లకు పడిపోయింది. కొంతమందికైతే 13 క్వింటాళ్లే గగనమైంది. దీనికితోడు తాలుగాయలూ ఎక్కువగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. పైగా ధర కూడా పడిపోవడంతో పెట్టుబడి ఖర్చులైనా రాక అప్పుల పాలవుతామని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పురుగు మందులు, ఇతర ఖర్చులు కలిపి ఎకరాకు రూ20 వేల వరకూ ఈ ఏడాది పెట్టుబడి పెరిగింది. అయినా వెరవక ముందుకే సాగారు. తొలిపంటను కళ్లాల్లో పోసి అమ్మకానికి సిద్ధం చేయగా ధర లేక దిగాలు పడుతున్నారు. గతేడాది ఇదే రోజుల్లో క్వింటాళ్ రూ.17 వేలు ఉండగా ప్రస్తుతం రూ.11 వేల నుంచి రూ.13 వేల మధ్యలో ఉంది. మరోవైపు గతేడాది పంటను గోడౌన్లలో పెట్టిన రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. తక్కువ ధరకు అమ్ముకోలేక, అప్పులు వడ్డీలు చెల్లించలేక అవస్థ పడుతున్నారు.



చిలకలూరిపేట మండలంలో 2600 ఎకరాలు, యడ్లపాడు మండలంలో 900 ఎకరాలు, నాదెండ్ల మండలంలో 2200 ఎకరాల్లో ఈ ఏడాది మిర్చి సాగు చేశారు. ఎకరాకు రూ.లక్షన్నర నుండి రూ.1.75 లక్షల వరకూ పెట్టుబడి ఖర్చయింది. పంట అమ్మడానికి సిద్ధమైన రైతుల వద్దకు వ్యాపారులు వచ్చి తక్కువ ధరకు అడుగుతున్నారు. అమ్మితే సరి లేకుంటే వెనక్కు వెళ్లిపోతున్నారు. అప్పుల బాధలు పడలేని రైతులు పంటను అమ్ముకుంటుండగా కొంతమంది ఇంకొన్ని రోజులైనా ఆగితే ధర పెరుగుతుందేమోనని నిరీక్షిస్తున్నారు. మరికొందరు పంటను కోల్డ్ స్టోరేజీలకు తరలించుకుంటున్నారు. రెండున్నర ఎకరాల్లో తేజా రకం మిర్చి పంటను వేశానని, రూ.2.80 లక్షల వరకూ పెట్టుబడి కాగా మొదటి కోత కోసి కళ్లంలో ఆరబోశాక అమ్మడానికి వ్యాపారులను పిలిస్తే కాయలను చూసి కొనకుండా వెనుదిరిగి వెళ్లిపోయారని, కారణమూ తెలియడం లేదని గణపవరానికి చెందిన రైతు బయపనేని వెంకట నారాయణ వాపోయారు. యార్డుకు తీసుకెళ్తే సగానికి సగం తాలు ధర వేశారని కావూరుకు చెందిన చందారం శ్రీనివాసరావు తెలిపారు. కొంత సరుకుని రూ.11 వేలకు కొన్నారని చెప్పారు.



అడిగిన అందరికీ ఉపాధి హామీ పని చూపాలి

ప్రజాశక్తి - రాజుపాలెం

కోరిన అందరికీ ఉపాధి హామీ పని చూపాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు డిమాండ్ చేశారు. సంఘం చేపట్టిన బైక్ యాత్ర బుధవారం మండలంలో పర్యటించింది. ఈ సందర్భంగా కూలీలను నాయకులు కలిసి వారితో మాట్లాడారు. పనుల కల్పనలో రాజకీయ వివక్ష చూపుతున్నారని, కనీస వేతనం రూ.307 అమలు కావడం లేదని అన్నారు. ఇప్పటికీ జాబ్ కార్డులు అందని కూలీలున్నారని, వారిందరికీ కార్డులివ్వడం తోపాటు అవసరమైన అందరికీ పనులు చూపాలని రవిబాబు కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జె.భగత్, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, సలోమి పాల్గొన్నారు.



సిపిఎం జాతీయ మహాసభకు తరలివెళ్లిన శ్రేణులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో 2-6 తేదీల్లో జరిగే సిపిఎం 24వ జాతీయ మహాసభలకు నరసరావుపేట నుండి సిపిఎం శ్రేణులు మంగళవారం రాత్రి బయలుదేరి వెళ్లాయి. వెళ్లిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, పి.మహేష్, ఆంజనేయరాజు, కె.సాయికుమార్, ఎస్.వెంకాయమ్మ, జె.రాజ్‌కుమార్, టి.ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.



పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యడ్లపాడు

తల్లిదండ్రుల్లేని 10 మంది నిరుపేద పిల్లలకు ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని మండలంలోని లింగారావుపాలెం జెడ్‌పి పాఠశాలలో బుధవారం అందించారు. ఈ మొత్తంలో రూ.15 వేలను స్థానికులు, మదర్ ఇండియా కాటన్ ట్రేడర్స్ ప్రొప్రైటర్ నంబూరు రమేష్ సమకూర్చగా, రూ.5 వేలను కన్నెగంటి వీరాంజనేయులు అందించారు. హెచ్‌ఎం కె.వి.రామిరెడ్డి, ఎస్‌ఎంసి ఛైర్మన్ షేక్ జాన్‌సైదులు, ఎన్.శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

సత్తెనపల్లి కోర్టుకు మనోహర్ నాయుడు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



సత్తెనపల్లి ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు వైసిపి నేత, గుంటూరు కార్పొరేషన్ మాజీ మేయర్ కావటి మనోహర్ నాయుడు బుధవారం హాజరయ్యారు. వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డిపై విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో జరిగిన దాడికి నిరసనగా క్రోసూరులో చేసిన ధర్నాపై అప్పటి టిడిపి ప్రభుత్వం వీరిపై కేసు నమోదు చేసింది. ఆ కేసులో కోర్టుకు హాజరు కాగా, విచారణ నిమిత్తం కేసును వాయిదా వేసినట్లు న్యాయవాది మర్రి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.



హేళనగా మాటలు.. సమస్యలూ వినరు..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు ఇబ్బందులు పెడుతున్నారని కమిషనర్ ఎదుట 4వ డివిజన్ పారిశుధ్య కార్మికులు వాపోయారు. సమస్యలేమి చెప్పినా పట్టించుకోవడం లేదని అన్నారు. వారి తీరును నిరసిస్తూ బుధవారం పనులు మానేసి ఆందోళన చేపట్టారు. తమ పట్ల అధికారుల ప్రవర్తిస్తున్న తీరుపై నరసరావుపేట మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ (సిఐటియు, ఎఐటియుసి) ఆధ్వర్యంలో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు సిలార్ మసూద్ మాట్లాడుతూ అనారోగ్యానికి గురై విశ్రాంతి కావాల్సిన కార్మికుల స్థానంలో బదిలీ కార్మికులకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ రమాదేవి ప్రవర్తన కార్మికుల పట్ల సరిగా లేదని, హేళనగా అవమానకరంగా మాట్లాడుతున్నారని చెప్పారు. కార్మికుల సమస్యలు చెప్పినా వినడానికి అంగీకరించడం లేదన్నారు. కార్మికుల పట్ల మేస్త్రీలు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, దాడికి యత్నిస్తున్నారని అన్నారు. సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ చెప్పడంలో ఆందోళన విరమించి విధులకు హాజరయ్యారు.

ప్రభుత్వ వైద్యశాలలో సాధారణ కాన్పులకే ప్రాధాన్యం

ప్రజాశక్తి - మాచర్ల



ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం కోసం వచ్చిన వారికి వీలైనంత వరకు సాధారణ కాన్పు కోసం ప్రయత్నిస్తామని, తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ చేస్తామని మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉదయభాను బుధవారం తెలిపారు. సాధారణ కాన్పుల వల్ల తల్లికి ఎంతో మేలు జరుగుతుందని, కాన్పు అయిన 24 గంటల్లో ఇంటికి వెళ్ళవచ్చని చెప్పారు. తల్లి త్వరగా కోలుకోవటం వల్ల కాన్పు జరిగిన మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వవచ్చని, దాని వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డ శారీరకంగా మానసికంగా బాగా ఎదుగుతారని తెలిపారు. సిజేరియన్ వలన కొన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని, వారం రోజులు ఆసుపత్రిలో ఉండాల్సి వస్తుందని అన్నారు. అంతేకాక తదుపరి కాన్పులో సమస్యలు వచ్చే అవకాశం వుంటుందని తెలిపారు. కాన్పుల కోసం వచ్చే వారు సిజేరియన్ కోరవద్దని, తల్లీబిడ్డ క్షేమం కోసం సాధారణ కాన్పులే చేయించుకోవాలని సూచించారు.

కలెక్టర్, ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలి

14వ రోజుకు మున్సిపల్ కార్మికుల దీక్షలు - పలు సంఘాల సంఘీభావం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



కార్మికులకు మద్దతుగా మాట్లాడుతున్న ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి రెడ్ బాషా

చేసిన పనికి సరైన వేతనం ఇవ్వకుంటే కార్మికులు ఎలా బతకాలని పలు సంఘాల నాయకులు ప్రశ్నించారు. తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం 14వ రోజుకు చేరగా శిబిరాన్ని ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి రెడ్‌బాషా సందర్శించి సంఘీభావంగా మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, శ్రమ దోపిడీ చేయొద్దని అన్నారు. ఆరేళ్లగా పని చేస్తున్న 40 మంది కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయడంలో తాత్సారం తగదన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులతో పాటు వీరి పేర్లు ఏపి ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్లో నమోదైనా వివక్ష ఎందుకని ప్రశ్నించారు. పట్టణీకరణ పెరిగిన నేపథ్యంలో కార్మికుల సంఖ్య పెంచాలని, పని భద్రత కల్పించాలని, దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు. పిడిఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ రెండు వారాలుగా ఆందోళన చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘీభావం తెలిపిన వారిలో పిడిఎం సీనియర్ నాయకులు ఎన్.రామారావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వి.కోటానాయక్, ఎంఐఎం నాయకులు షేక్ మౌలాలి, ఎంహెచ్‌పిఎస్ రాష్ట్ర నాయకులు షేక్ మస్తాన్‌వలి, బీసీ సంఘం నాయకులు బి.శ్రీనివాసరావు ఉన్నారు. దీక్షల్లో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సాల్మన్, నాయకులు నరసింహారావు, జె.శ్రీను, వై.ఇంద్రయ్య, కె.మరియదాసు, కె.దేవదానం, సమాధానం, నాగరాణి, జె.వీరయ్య, జి.చందు, జి.చిట్టిబాబు, యు.రాజు, ఎ.లత, వి.నాగమణి, పి.కోటేశ్వరరావు, జె.ప్రేమ్‌కుమార్, షేక్ ఖాదర్‌వలి, జి.రాంబాబు, సెల్వి, జగన్నాథం, సాల్మన్ పాల్గొన్నారు.

7న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 7న విజయవాడ ఎపిసిపిడిసిఎల్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బ్రాడీపేటలోని సిఐటియు కార్యాలయంలో ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022 పిఆర్‌సి బకాయిలు నేటికీ జమ కాలేదని, తక్షణమే విడుదల చేయాలని కోరారు. తెలంగాణ తరహాలో సంస్థలో విలీనం చేసి సంస్థ ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్మికులకు కొత్త, పాత పేరుతో వేర్వేరు జీతాలు ఇస్తూ వెట్టిచాకిరీ చేయించుకోవటం సరికాదన్నారు. సమాన పనికి సమాన వేతనం, అందరికీ ఒకే రకమైన వేతనాలు ఇవ్వాలని, సీనియర్లకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కొత్త షిఫ్టు ఆపరేటర్లందరికీ పాత ఆపరేటర్‌తో సమానంగా జీతాలు ఇవ్వాలని, పీస్ రేటు కార్మికులుగా ఉన్న స్టోర్ హమాలీలు, మీటర్ రీడర్స్, బిల్ కలెక్షన్ ఏజెంట్లు ఉద్యోగ భద్రత కల్పించి నెల వేతనాలు ఇవ్వాలన్నారు.ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉన్న వాచ్‌మెన్ అందరికీ స్కిల్డ్ వేతనం, జాతీయ, పండగ సెలవు దినాలకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని అన్నారు. అలాగే ప్రతి సబ్‌స్టేషన్‌లో నైట్‌వాచ్మెన్ కచ్చితంగా నియమించాలని, ట్రాన్స్కో డిస్కం, జెన్కోలో పనిచేస్తున్న 23,500 మంది విద్యుత్ కార్మికులకు 2022 పిఆర్‌సి బకాయిలు ఇంతవరకు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా ఉన్నారు. ఆయా సమస్యలపై 7న జరిగే ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి బి. ముత్యాలరావు,యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.పవన్, జిల్లా కోశాధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి – తాడేపల్లి రూరల్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజలపై భారాలు వేసే స్మార్ట్ మీటర్లను ఉపసంహరించు కోవాలని, సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, దొంతి రెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎం.టి.ఎం.సి పరిధిలోని గుండిమెడ గ్రామంలోని ప్రధాన రహదారి వద్ద బుధవారం సాయంత్రం స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, దొంతి రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి పార్టీలు నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను నెత్తిన విద్యుత్ బారాలు ట్రూ అప్ చార్జీల పేరుతో విపరీతంగా పెంచేశారని మండిపడ్డారు. విద్యుత్ చట్ట సంస్కరణలో భాగంగా విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేసి, కార్పొరేట్ కంపెనీలకు అప్ప చెప్పడం దుర్మార్గమని అన్నారు. ప్రజలపై అదనపు భారాలుగా ఉన్న స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని, ఇంటింటికి సిపిఎం పేరుతో ప్రచారం నిర్వహిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని చెప్పిన నారా లోకేష్ నేడు అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్ర బిజెపి విధానాలనే కూటమి ప్రభుత్వం అనుసరిస్తుందని అన్నారు. సెల్ఫోన్ మాదిరిగా ప్రీపెయిడ్ విధానాన్ని తీసుకువచ్చి, స్మార్ట్ మీటర్ల రూపంలో ప్రజలపై భారాలు వేయటం ఉపసంహరించుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. అనంతరం స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచార పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం గుండి మెడ గ్రామ కార్యదర్శి నాగ పోగు విజయరాజు, జెట్టి రాంబాబు, సాంబయ్య, రత్తయ్య, చిన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య

క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి – మంగళగిరి

ఎంటిఎంసి పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య అన్నారు. బుధవారం సాయంత్రం మంగళగిరి సిఐటియు కార్యాలయంలో క్లాప్ ఆటో డ్రైవర్ల విస్తృత సమావేశం సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు. చెంగయ్య మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు రెండు నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడం లేదని విమర్శించారు. 16 నెలలుగా ఈఎస్ఐ, పిఎఫ్ లు ఆటో డ్రైవర్ల ఖాతాలో వేయడం లేదని విమర్శించారు. కాంట్రాక్టర్ తమ ఖాతాలో వేసుకుంటున్నాడని అన్నారు. ఆటో డ్రైవర్లకు కనీస వేతనం కూడా ఇవ్వడం లేదని అన్నారు. కేవలం 12500 రూపాయలు మాత్రమే నెలకు ఇస్తున్నారని అన్నారు. కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వడం లేదని విమర్శించారు. ఇచ్చే వేతనం కూడా సక్రమంగా నెల నెల వేయడం లేదని అన్నారు. ఆటోలు రిపేర్లకు వచ్చినప్పటికీ మరమ్మతులు చేయించడం లేదని విమర్శించారు. ఇటీవల ఒక ఆటో బోల్తా కూడా పడిందని అన్నారు. అయినప్పటికీ కాంట్రాక్టర్, కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఈ సమస్యలను పరిష్కరించాలని ఈనెల మూడవ తేదీన కార్పొరేషన్ కమిషనర్ కు వినతిపత్రం అందజేస్తున్నట్లుగా తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాల సంస్థ క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఎన్నికైంది. కార్యదర్శిగా ఎం రవి, అధ్యక్షులుగా డి శివ, ఉపాధ్యక్షులుగా దుర్గా, శ్యామ్, కృష్ణ, సహాయ కార్యదర్శిగా ఎం.యోహాన్, టి సతీష్, కోశాధికారిగా సాయి ఎన్నికయ్యారు.

ఉద్యోగుల సమస్యలపై స్పందించకుంటే ధర్మపోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న చాంద్‌బాషా

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ధర్మ పోరాటానికి సిద్ధంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాష అన్నారు. బుధవారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు గత రెండేళ్లుగా పిఆర్‌సి లేదని, డిఎలు లేవని, మూడేళ్ల నుండి సరెండర్ లీవులు లేవని, చివరికి సిపిఎస్ రద్దు కూడా లేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా అన్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు దాటినా గత ప్రభుత్వం నుంచి ఈ ప్రభుత్వం వచ్చి 10 నెలలు కావస్తున్నా నేటి వరకూ ఒక్క సమస్య కూడా పరిష్కారించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లకోసారి పిఆర్‌సి, ఆరు నెలలకు ఒకసారి డిఎ వంటి ఉద్యోగుల సాధారణ కోర్కెలను కూడా ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదన్నారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులు కూడా చెల్లించట్లేదన్నారు. పిఆర్‌సి గడువు ముగిసి 2 సంవత్సరాలు కావస్తున్నా కనీసం ఐఆర్ కూడా ప్రకటన చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసి సమస్యలన్నీ పరిష్కారించాలని కోరారు.ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యోగులు ధర్మ పోరాటానికి సిద్ధంగా ఉండాలని కోరారు. సమావేశంలో జిల్లా కోశాధికారి పోతురాజు , జిల్లా ఉపాధ్యక్షుడు రహెమాన్, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోట సాహెబ్, నగరశాఖ అధ్యక్షులు వై నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐదవ రోజుకు జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శన

సేద్యం విభాగంలో విజేతలుగా జి.ఎల్.ఆర్ బుల్స్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పౌరుషానికి ప్రతీకలైన ఒంగోలు జాతి గిత్తలను బలప్రదర్శనలు ద్వారా నేటి తరానికి చూపిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే నక్క ఆనందబాబు అభినందనీయులని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో ఐదవరోజు కొనసాగుతున్న జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శనలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత సేద్యం(సెటగిరి) విభాగంలో మంగళవారం నిర్వహించిన ఎడ్లబల ప్రదర్శనలో విజేతలు, అలాగే పశుపాల ప్రదర్శనలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎడ్ల ప్రదర్శనలు నిలిపివేయడానికి ప్రతిపక్షం పన్నిన కుట్రకు న్యాయస్థానం తీర్పు ద్వారా తెరపడిందని తెలిపారు. రైతు, మహిళా పక్షపాతిగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరిన్ని సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించనున్నారని తెలిపారు. పేద రహిత రాష్ట్రంగా కార్పొరేషన్ నిధులతో బిసిల అభ్యున్నతికి కృషి చేస్తున్న చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామీణ నేపథ్యంలో నిర్వహిస్తున్నటువంటి ప్రదర్శన పోటీలు, రైతు వైజ్ఞానిక ప్రదర్శనలు రైతులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. అనంతరం గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులు ఆనందబాబు ఎమ్మెల్యే రాజేంద్రప్రసాద్ లను అభినందించారు. చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ 2014 ముందు ఎడ్ల ప్రదర్శనలను నిలిపివేశారని, చంద్రబాబు నాయుడు చొరవతో పోటీలు పునఃప్రారంభానికి కృషి చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంఘం ఛైర్మెన్ ముస్తాక్ అహ్మద్, క్రాంతి కుమార్, కుమార్ పంప్స్ అధినేత కొత్తా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. అత్యధికంగా 12 కేజీల పాలను ఉత్పత్తిచేసి పశుపాల ప్రదర్శనలో ప్రథమ స్థానం సాధించిన ఆవుల యజమాని పొలడగు సురేంద్రను మంత్రి సత్కరించారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు, పెదగొట్టిపాడు ప్రాంతానికి చెందిన జిఎల్ఆర్ బుల్స్ (భగవంత్ కేసరి) గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లజతకు ప్రథమ బహుమతి లభించింది. విజేతకు రూ 60 వేలు పారితోషకంతో అందజేశారు. పల్నాడుజిల్లా క్రోసూరు ఉయ్యందన ప్రాంతానికి చెందిన సంపటం వీర బ్రహ్మనాయుడు ఎడ్ల జతకు ద్వితీయ బహుమతి దక్కింది. విజేతకు రూ. 50 వేలు పారితోషకం అంద జేశారు. బాపట్ల జిల్లా, చుండూరు, వేటపాలెం ప్రాంతా నికి చెందిన ఆర్సి బుల్స్ శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జతకు మూడవ బహుమతి లభించింది. విజేతకు రూ 35 వేలు నగదు ప్రోత్సాహకం అందుకున్నారు. విజేతలకు నగదు పారితోష కంతో పాటు మంత్రి సవిత జ్ఞాపికలను అందజేసారు.





ప్రథమ విజేత గరికపాటి లక్ష్మయ్య చౌదరి జట్టుకు ,పశుపాల విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న పొలడగు సురేంద్ర కు బహుమతి ప్రదానం చేస్తున్న మంత్రి సవిత, ఆలపాటి, నక్కా ఆనందబాబు

ఎయిమ్స్‌లో మౌలిక వసతులు పెంచండి

1,054 పోస్టులను మంజూరు చేయాలి

కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్‌కు పెమ్మసాని వినతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో మరిన్ని మౌలిక వసతులను పెంచాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. ఈమేరకు బుధవారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఢిల్లీలో కలిసి పలు అంశాలపై చర్చించారు. ఎయిమ్స్ సామర్థ్యాన్ని పెంచే విధంగా 1,054 పోస్టులను భర్తీ చేయడంతో పాటు పలు మౌలిక సదుపాయాల కల్పనను కోరారు. ప్రతిపాదనలను సావధానంగా ఆలకించిన తరువాత ఆమె సుముఖంగా స్పందించారు. పెమ్మసాని మాట్లాడుతూ ఈ ప్రయత్నం ద్వారా ఏటా సుమారు రూ. 250 కోట్లను ఎయిమ్స్ కు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం అదనంగా భరిస్తుందని తెలిపారు. 105 ఫ్యాకల్టీ పోస్టులు, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు, జూనియర్ రెసిడెంట్ పోస్టులు,నర్సింగ్, నాన్ ఫ్యాకల్టీ పోస్టులు మంజూరు చేసి మొత్తం 960 పడకలను రోగులకు అందుబాటులో తేవాలని మంత్రిని కోరామన్నారు.



నర్సింగ్ పాఠశాల ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో ప్రభుత్వ నర్సింగ్ పాఠశాలను సూపరింటెండెంట్ డాక్టర్ రమణ ఎస్ఎస్‌వి జ్యోతి ప్రజ్వలన చేసి బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. విద్యార్థులు నిబద్ధతతో అంకితభావంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. రోగుల పట్ల కరుణ, మానవత్వం కలిగి ఉండాలని, నైపుణ్యం కలిగిన నర్సులుగా సమాజానికి ఉపయోగపడాలని ఆయన ఆకాంక్షించారు. స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ సుజాత, ఆర్ఎంవో సతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ 1 కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ప్రారంభమైన ఈ పాఠశాల ద్వారా అర్హత కలిగిన నర్సులు తయారై రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తారని ఆశిస్తున్నట్లు అభిప్రాయపడ్డారు.



వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు టిడిపి, జనసేన

మద్దతు ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి – తెనాలి

వక్ఫ్ చట్ట సవరణ 2024 బిల్లుకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి, జనసేన పార్టీలు మద్దతు ఉపసంహరించుకోవాలని ముస్లిం సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రభుత్వ తీరుకు నిరసనగా పట్టణంలో మజ్లిసుల్ ఉలామా–వల్ అయిమా, జమియతే ఉలామా హింద్ ముస్లిం సంఘాలు సంయుక్తంగా బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ జాయింట్ పార్లమెంటరీ కమిటీ ద్వారా ఆమోదం పొంది, పార్లమెంట్లో ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణ 2024ను దేశంలో ముస్లిం మైనారిటీలంతా వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. ముస్లింల మతపరమైన హక్కులలో జోక్యం, రాజ్యాంగం ప్రకారం సంక్రమించిన ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేదిగా చట్ట సవరణ బిల్లు ఉందని చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 26, 29, 30 ప్రకారం మతపరమైన ఆస్తులను పరిరక్షించుకోవడం వారి హక్కుని స్పష్టం చేశారు. దానికి భంగం కలిగించే చట్ట సవరణ ఆమోదయోగ్యం కాదన్నారు. ర్యాలీలో పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

మూడు నెలలుగా కంది పప్పును పంపిణీ చేయని ప్రభుత్వం

ఆకాశంలో ప్రత్యామ్నాయ నల్ల, పచ్చ పెసలు ధరలు ...

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రభుత్వం మారినా ప్రజా పంపిణీ వ్యవస్థ ఇంకా గాడిలో పడలేదు. పేదలకు ప్రతి నెలా ఇవ్వాల్సిన కంది పప్పును,నూనె (పామాయిల్) సరిగా ఇవ్వడం లేదు. పామాయిల్ మొత్తంగా రేషన్లో ఇవ్వడం మరచిపోయారు. నెల పంపిణీ ఆపటం వల్ల ప్రభుత్వానికి లక్షల్లో ఆదాయం మిగులుతుంది. అందువల్ల కంది పప్పు ఒక నెల ఇస్తే రెండు, మూడు నెలలు పంపిణీ చేయని పరిస్థితి కొనసాగుతోంది. ఎండియు వాహనం దగ్గరకు సరుకుల కోసం వెళ్లిన పేదోళ్లకు ఎప్పుడు చూసినా కంది పప్పు రాలేదనే సమాధానమే వినిపిస్తోంది. మండలంలోని నియోజకవర్గ స్థాయిలో 88 వేలు,అందులో మండలంలో షుమారుగా 44 వేల మంది తెల్లరేషన్ కార్డుదారులకు ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు కందిపప్పు అందలేదు. ప్రతి నెలా కార్డుదారులందరికీ కిలో కందిపప్పు ఇవ్వాలంటే 82 మెట్రిక్ టన్నుల పప్పు అవసరం కానుంది. నూనె కూడా కిలో చొప్పున 82 వేల కిలోలు అవసరమౌతాయి. దీనిని ప్రభుత్వం ఇవ్వలేదు. ఇస్తే కందిపప్పు పంపిణీ చేస్తామని పౌర సరఫరాల శాఖాధికారులు చెబుతున్నారు. తెల్లరేషన్ కార్డు దారులకు కిలోకంది పప్పును రూ.67కు పౌర సరఫరాల శాఖ ఇస్తోంది. సరుకు రాలేదని ఫిబ్రవరి నుంచి లబ్దిదారులకు ఇవ్వడం లేదు. బహిరంగ మార్కెట్లో కిలో కంది పప్పు ధర రూ.130 నుంచి రూ.150, కిలో పామాయిల్ రూ. 130 లుగా అమ్ముతున్నారు. అదే వీధి కొట్లల్లో అయితే బజార్లల్లో రూ. 10 నుంచి 15 వరకు అదనంగా అమ్ముతున్నారు. బయట మార్కెట్లో అదనంగా దాదాపు వంద, నూట ఇరవై రూపాయలు పెట్టాల్సి రావడంతో కంది పప్పు వాడకం తగ్గించారు. ప్రత్యామ్నాయంగా నల్ల పెసలు, పచ్చపెసలు వాడుకుందామంటే అవి కూడా కిలోరూ. 120లుగా ఉంది. కంది పప్పు పంపిణీలో గత ప్రభుత్వం నుంచి ఈ ప్రభుత్వం వరకు నిర్లక్ష్యం కొనసాగుతూనే వుంది. కొనుక్కొని తినే స్థోమతలేని పేదలకు ప్రతి నెలా కంది పప్పు రాయితీపై పంపిణీ చేయా లన్న ఆలోచన ప్రభుత్వానికి లోపించింది. ఆలస్యమైన కొద్దీ రాయితీ సొమ్ము ప్రభుత్వానికి ఆదాకావడంతో కందిపప్పు పంపిణీపై ఆసక్తిని చూపటం లేదు.. ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వం స్పందించి కందిపప్పు పామాయిల్ సరఫరా చేస్తే పేదలకు మేలుగా ఉంటుందంటున్నారు

ప్రతి సమస్యను పరిష్కరిస్తా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి పెదకూరపాడు

ప్రజా దర్బార్ ద్వారా ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించే దిశగా పని చేస్తామని పెదకూరపాడు నియోజకవర్గ శాసన సభ్యులు భాష్యం ప్రవీణ్ అన్నారు. బుధవారం పెదకూరపాడులో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గ ప్రజల నుండి వివిధ సమస్యలపై దరఖాస్తులు ఎమ్మెల్యే ప్రవీణ్ తీసుకున్నారు. ఎన్ని రోజుల నుండి ఈ సమస్య ఉంది అడిగి తెలుసుకున్నారు. బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు పని చేయాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని 51 దరఖాస్తులు వివిధ సమస్యలపై వచ్చాయి. వాటిల్లో 25 భూ సంబంధమైనవి. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఆర్తిమళ్ళ రమేష్, పెదకూరపాడు సర్పంచి గుడిపూడి రాజు ,పెదకూరపాడు తహసిల్దార్ ధనలక్ష్మి, ఇన్చార్జి ఎండిఓ సోమ యాజులు, మండల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో ప్రజా వేదిక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. బుధవారం గుంటూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదికకు 226 అర్జీలు రాగా వాటిని ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వితంతు పెన్షన్లు, ఇంటి స్థలం కోసం వచ్చిన వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ రమాదేవి

డాక్టర్ సరికొండ రమాదేవికి అవార్డులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి:

సత్తెనపల్లి కి చెందిన సాహితీవేత్త డాక్టర్ సరికొండ రమాదేవికి జాతీయ సాహిత్య సేవ కళా భరణం", బంగారు కలిశ పీటం ఆవార్డు-2025ను బహూకరించారు. ఈ మేరకు కళా నిలయం -2025 ఉగాది పండుగ సందర్భంగా మార్చి 31వ తేదీన లాస్య పబ్లిక్ స్కూల్, ఒంగోలులో సాహిత్యం సేవలను దృష్టిలో ఉంచుకొని యల్.సి.ఇ.యస్ కలానిలయం చైర్మన్ కే.బుచ్చేస్వర రావ, వేద పండితులు సాహిత్య రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవికి అవార్డు అందచేసి సన్మానించారు. ఈ సందర్భగా డాక్టర్ సరికొండ రమాదేవికి సత్తెనపల్లిలోని వివిధ అధినేతలు, కార్యదర్శులు, అభినందించారు.

ఉద్యోగులకు ఏపీవో ఆదర్శం

ప్రజాశక్తి పెదకూరపాడు

ఏపీవో కోటేశ్వరరావు కొత్తగా చేరే ఉద్యోగులకు, చేస్తున్న సిబ్బందికి ఆదర్శమని ఇన్చార్జి ఎండిఓ సోమయాజులు అన్నారు. బుధవారం ఏపీవో బదిలీ సందర్భంగా క్షేత్ర సహాయకులు మండల కార్యాలయం సిబ్బంది ఘనంగా దశ్శాలువాతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ పనిని ఎప్పటికప్పుడు సకాలంలో పూర్తి చేయటం లక్ష్యంగా కోటేశ్వరరావు పని చేస్తారన్నారు. సాధారణ బదిలీల భాగంగా నరసరావుపేట మండలానికి కేటాయించారు.

విఓఏలు, ఎన్యూమరేటర్లకు శిక్షణా కార్యక్రమం

ప్రజాశక్తి నాదెండ్ల

పల్నాడు జిల్లా నాదెండ్ల మండలంలోని మండల సమాఖ్య కార్యాలయంలో విఓఏలు, ఎన్యూమరేటర్ల మండల స్థాయి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. 2025 - 26 సంవత్సరంనకు సంబంధించి స్వయం సహాయక సంఘాలకు వార్షిక అప్పులు, జీవనోపాదుల ప్రణాళికలు తయారు చేయడం కోసం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి మాట్లాడుతూ ఎన్యూమరేటర్లకు యాప్లో ఎలా చేయాలో అందరికి వివరించటం, ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయమని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు, డిపిఎం హనుమా నాయక్, ఏపిఎం రమేష్‌బాబు, సిసిలు సాంబశివరావు, హేమలత, సుధారాణిలు, ఎల్సి నాగూర్, అకౌంటెంట, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

బెజగం రవి కుమార్‌కి విశ్వావసు ఉగాది జాతీయ పురస్కారం

"జాతీయ పౌరాణిక కళా తపస్వి", "పూర్ణ కుంభ పీఠం" ప్రదానం

ప్రజాశక్తి-సత్తెనపల్లి:

బెజగం రవికుమార్‌కి విశ్వావసు ఉగాది జాతీయ పురస్కారం "జాతీయ పౌరాణిక కళా తపస్వి", "పూర్ణ కుంభ పీఠం" ప్రదానం చేశారు. ఈ మేరకు ఏప్రిల్ 31వ తేదీ ఎం. వి. ఆర్. కల్చరల్ అకాడమీ, ఎల్సిఈఎస్ కళా నిలయం ఒంగోలు వారి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక లాస్యప్రియ పబ్లిక్ స్కూల్ ఆవరణలో శ్రీ విశ్వావసు ఉగాది జాతీయ పురస్కారాలు 2025 కార్యక్రమం లిటిల్ ఛాంప్స్ అధ్యక్షుడు బుచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో వివిధ రంగాలలో ప్రావీణ్యం సాధించిన కళాకారులూ, సాహితీ వేత్తలు, వైద్యులు, నాట్య రంగాలలో వారికీ ఈ విశ్వావసు ఉగాది జాతీయ పురస్కారాలు 2025 ప్రదానం చేసారు.ఈసారి వేదంపండితుల వేదాశిర్వచనలతో పురస్కారాలు ప్రదానం చేయడం విశేషం. "అర్ధ శతక " పురస్కారాలు గ్రహిత బెజగం రవికుమార్‌ని వివిధ కళా సంస్థల వారు మిత్రులు బంధువులు సహ కళాకారులూ రవి కుమార్ ని అభినందించారు.



రవికుమార్‌ని సత్కరిస్తున్న కళాకారులు

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లిలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు.సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్ శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ కార్యాలయం నందు నిర్వహించిన. ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొని. ప్రజల సమస్యల గురించి అడిగి తెలుసుకుని. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి వాటిని పరిశీలించారు. ప్రతి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. తక్షణమే ప్రజా సమస్యలను పరిష్కారించాలనీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

సెయింట్ ఆన్స్ స్కూల్లో యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాం



సర్టిపికెట్లతో చిన్నారులు

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరు సెయింట్ ఆన్స్ పాఠశాలలో బుధవారం యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాం ప్రధానోపాధ్యాయులు సిస్టర్ మేరీ రజిత ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏకుల ప్రసాదరావు మండల విద్యాశాఖాధికారులు-1 లు, ఎమ్ గణేష్ మండల విద్యాశాఖ అధికారులు -2 హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న పిల్లల విద్యగొప్పతనాన్ని,మానసిక వికాసం నైతిక విలువల ప్రాముఖ్యతను గురించి చిన్న వయసులోనే పాఠశాలలో వీటిని నేర్పిస్తున్నందుకు అభినందనలు తెలియపరిచారు. ప్రధానోపా ధ్యాయులు సిస్టర్ మేరీ రజిత మాట్లాడుతూ ఉద్దేశించి ఉన్న స్థితి నుండి ఉన్నతమైన స్థితిలోనికి అడుగిడాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని విద్యార్థులకు సూచించారు. ఏకుల ప్రసాదరావు సెయింట్ ఆన్స్ పాఠశాలను ఉద్దేశించి క్రమశిక్షణకు మారుపేరు అని బిరుదు ఇవ్వటం జరిగినది. అది తక్కువ ఫీజుతో మంచి క్రమశిక్షణతో మంచి నాణ్యమైన విద్యను అందిస్తున్నారని కొనియాడారు. ఈ విద్యా సంవత్సరములో అనేక రంగాలలో ఉత్తీర్ణత సాధించిన వారికీ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువులకు 12 నీటి తొట్టి నిర్మాణాలకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి - అచ్చంపేట

మండలంలో 12 నీటి తొట్టి నిర్మాణాలకు బుధవారం భూమి పూజ నిర్వహించినట్లు ఏపీవో సిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ కమిషనర్, పల్నాడు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు అచ్చంపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే శ్రీనివాసరావు సూచనలు మేరకు అచ్చంపేట మండలంలో వేల్పూరు 4 కొండూరు 3 రుద్రవరం 2 పెదపాలెం 1 మిట్టపాలెం 1, చిగురుపాడు 1 మొత్తం పశుసంవర్ధక శాఖ వారి సమన్వయంతో భూమిపూజ చేసినట్లు చెప్పారు. పశువులు అధికంగా ఉన్న గ్రామాలలో ప్రభుత్వ బోర్లు ఉన్నచోట రహదారి పక్కగా ఉన్న ఖాళీ ప్రదేశాలలో ఈ నీటి తొట్టెలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉపాధి హామీ నిధుల కింద ఒకొక్క నీటి తొట్టికి రూ. 35వేలు కేటాయించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ పి. స్వాతి దేవి వేల్పూర్ సర్పంచ్ జె శివశంకర్ ,నాగన బోయిన గంగయ్య మద్రి కాటమరాజు ఆలా భాగేశ్వరరావు, ఉపాధిహామీ సిబ్బంది. జూనియర్ ఇంజనీర్ బి రమణమూర్తి టెక్నికల్ అసిస్టెంట్లు రాజ వర్ధన్ శేషారావు ఫీల్డ్అసిస్టెంట్లు పాల్గొన్నారు.



నీటి తొట్టి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఏపీఓ

రుణమేళాకు 112మంది హాజరు

ప్రజాశక్తి-ముప్పాళ్ల:

మండలంలోని మండల పరిషత్తు కార్యాలయం వద్ద వివిధ కార్పొరేషన్ల సబ్సిడీ రుణాల రుణమేళా ఇంటర్వ్యూలు బుధవారం జరిగాయి.యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సత్తెనపల్లి బ్రాంచి, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ముప్పాళ్ల బ్రాంచి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు మాదల బ్రాంచి నుంచి ఆయా బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. 112 మంది హాజరయ్యారనీ ఎంపిడివో కాశయ్య తెలిపారు. ఈ ఇంటర్వ్యూల ప్రక్రియలో ఈవోపిర్డి రూపావతి, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఒలింపియాడ్‌లో సత్తా చాటిన చైతన్య స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :

ఐఎన్‌టిఎస్ఓ ఒలింపియాడ్ పరీక్షా ఫలితాల్లో మాచర్ల శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ అయ్యపరెడ్డి హరణి మాట్లాడుతూ ఒలంపియాడ్ ఫస్టు, సెకండ్, థర్డు, ఫోర్తు స్థానాలు రెండు చొప్పున ఐదవ స్థానం ముగ్గురు సాధించారని తెలిపారు. ఈ పరీక్షల్లో మొత్తం 281 మంది మెరిట్ సర్టిఫికేట్లు సాధించారని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలసి చేసిన కృషి ఫలితంగానే మంచి ఫలితాలు వచ్చాయని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో డీన్ అనీల్, సి బ్యాచ్ ఇన్‌చార్జి శివ, షకీలా తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ గీతాంజలి

క్రోసూరు పీహెచ్‌సి సెంటర్‌ను డిఐఓ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరు పీహెచ్‌సి సెంటర్‌ను డిఐఓ డాక్టర్ గీతాంజలి బుధవారం ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన ఎన్.సి.డి 3.0 కార్యక్రమ నిర్వహణలో భాగంగా వైద్యఆరోగ్య శాఖ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను ఆరా తీస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు షుగర్, బీపీతోపాటు పలు రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు.ఇంటింటి సర్వేలో భాగంగా ప్రతి కుటుంబ సమగ్ర సమాచారం, ఆరోగ్యపరంగా కుటుంబ చరిత్ర, ఆహారపు అలవాట్లు, రక్తపోటు, మధుమేహం, హిమోగ్లోబిన్, నోటి క్యాన్సర్ పలు రకాల ఆరోగ్య సంబంధిత సమాచారాన్ని సేకరించి యాప్ లో ఆన్ లైన్ ద్వారా నమోదు చేస్తున్నారన్నారు. అనంతరం క్రోసూరు పీహెచ్ సి సెంటర్లోని రికార్డులను తనిఖీ చేసారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని వినతి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లో పనిచేస్తున్న దినసరి వేతన ఉద్యోగులను 60 సంవత్సరాలు దాటిన వారిని రిలీవింగ్ చేస్తున్న నేపథ్యంలో వారికి రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వాలని కోరుతూ ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ దినసరి ఉద్యోగుల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీ విసి కె. గంగాధర్, రిజిస్ట్రార్ జి. సింహాచలం, రెక్టార్ కె రత్న షీలా మణికు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే వెంకటేశ్వర రావు, సిహెచ్ గోపాలకష్ణ, రమణ, రమేష్ బాబు శ్రీనివాస్ సాయిబాబు శివరామకృష్ణ పాల్గొన్నారు.

వ్యవసాయ బోరు వివాదంపై విచారణ

ప్రజాశక్తి - తెనాలి

మండల గ్రామం కొలకలూరు పంచాయతీ పరిధి లోని ఖాజీపేటలో రైతుల మధ్య నెలకొన్న వ్యవసాయ బోరు వివాదంపై బుధవారం తహశీల్దార్ కె.వి గోపాల కృష్ణ విచారణ జరిపారు. గతంలో రైతులు ఉమ్మడిగా రెండున్నర సెంట్లు భూమిలో వ్యవసాయ బోరును ఏర్పాటు చేసుకున్నారు. దానిని ఉమ్మడిగా ఉపయోగించుకుంటున్నారు. ఇటీవల బోరుకు సంబంధించిన పైపు లైను ఏర్పాటులో, దాని నీటిని ఉపయోగించుకునే విధానంలో రైతుల మధ్య విభేదాలు నెలకొన్నాయి. అయితే వివాదం కోర్టులో నడుస్తోందని, ఈ నెల 17న తీర్పు వెలువడ నుండడంతోఅనంతరం అవసరమైన చర్యలు తీసుకుంటా మని తహశీల్దారు తెలిపారు. ఆయన వెంట వీఆర్వో కెజార్జిథామస్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



ర్యాలీలో తహశీల్దార్, సచివాలయ సిబ్బంది

భూముల రీసర్వేపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - తెనాలి

మండల పరిధిలోని పెదరావూరు గ్రామంలో జరుగు తున్న భూముల రీసర్వే ప్రక్రియపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ రీ సర్వేతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఒకే సర్వే నంబరులో వేరువేరుగా ఉన్న భూములకు ఒకే నెంబర్‌పై ల్యాండ్ పార్సెల్ మ్యాప్ ఇస్తారని చెప్పారు. హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య హక్కులు స్పష్టంగా పొందుపరచడం జరుగుతుం దన్నారు. రైతులు, గ్రామస్తులు రీసర్వే ప్రక్రియకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలపాటిపై ఐటిడిపి రూపొందించిన వీడియో ఆవిష్కరణ

ప్రజాశక్తి - తెనాలి శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఐటిడిపి నాయ కులు రూపొందించిన ప్రత్యేక వీడియోను వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆవిష్కరించారు. స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐటిడిపి సభ్యులు ఎం.విజయ్, వీడియో రూపకర్త నరిశెట్టి పవన్, కనికరం యోగేష్, వేమూరి పవన్, కన్నయ్య, వెంకట్, పార్టీ నాయకులు మహమ్మద్ ఖుద్దూస్, వెంకట పూర్ణచంద్, కే వాసుదేవ నాయుడు, డాక్టర్ వి. శేషగిరిరావు పాల్గొన్నారు.

బాపయ్య చౌదరికి పలువురు అభినందన

ప్రజాశక్తి - దుగ్గిరాల

పెదపాలెం గ్రామ కార్యదర్శిగా పనిచేస్తూ పదవి విరమణ చేపట్టిన కావూరి బాపయ్య చౌదరి అభినందన సభను బుధవారం మండల కేంద్రం దుగ్గిరాలలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనేకమంది ప్రజాప్రతినిధులు అధికారులు గ్రామ కార్యదర్శులు ఆయన సేవలను కొనియాడారు. అనంతరం బాపయ్య చౌదరి ఉష దంపతులను సత్కరించారు కార్యక్రమంలో ఎంపీపీ షేక్ జబీన్ గూడూరు వెంకట రావు వెనిగళ్ళ కష్ణ ప్రసాద్ సర్పంచ్ బాణావత్ ఖుషి భాయ్ వెంకటేశ్వర నాయక్ ఎంపీడీవో శ్రీనివాసరావు నిజాంపట్నం ఎంపీడీవో ఎన్ నాగలక్ష్మి మండలంలోని వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏఎన్‌యుకు నూతన ఫైనాన్స్ ఆఫీసర్ నియామకం


ఎసిఇకి నియామక ఉత్తర్వులు ఇస్తున్న వీసీ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి నూతన ఫైనాన్స్ ఆఫీసర్ నియామకం జరిగింది. స్టేట్ ఆడిట్ డిపార్ట్మెంట్‌లో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న వి. రవిష్ణ ఈ పదవి లో నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం ఇంచార్జి వీసీ ఆచార్య కె .గంగాధరరావును, ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కే.రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలంను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఏసీఈగా వెంకటేశ్వర్లు నియామకం

విశ్వవిద్యాలయంలో అదనపు పరీక్షల నియంత్రణ అధికారి (ఏసిఈ) గా డిప్యూటీ రిజిస్టార్ ఏ . వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఇంచార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు వెంకటేశ్వర్లకు నియామకపత్రం అందజేశారు. వెంకటేశ్వర్లు ప్రస్తుతం ఫైనాన్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు. ఈ సంద ర్భంలో వికాస జాయింట్ సెక్రెటరీ నేలపాటి నాగేశ్వరరావు, వై. రాధాకృష్ణ వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నిర్మల కుమారికి గురుదేవోభవ పురస్కారం

ప్రజాశక్తి - తెనాలి

రూరల్ గ్రామం కొలకలూరుకు చెందిన ఉపాధ్యాయుని పి నిర్మల కుమారి గుంటూరు ఎడ్యూహబ్ అందించిన గురుదేవోభవ పురస్కారాన్ని అందుకున్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రావులపాలెం మండలంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా ఆమె పని చేస్తున్నారు. ఎడ్యూహబ్ సంస్థ వివిధ రంగాలలో ఎంపిక చేసిన వారికి బుధవారం గుంటూరు పెన్షనర్స్ హాలులో నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవంలో గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని పురస్కారాలను అందజేశారు. ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాల్లో స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తున్న నిర్మల కుమారి, పలు సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారు.



పురస్కారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, కల్నల్ దీపక్ శర్మ, రామారావు విద్యాసంస్థల నుంచి కె తులసి విష్ణు ప్రసాద్, డాక్టర్ ఎన్.వి.పద్మిని పాల్గొన్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

4 నుండి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే జయంతోత్సవాలు

ప్రజాశక్తి - మంగళగిరి: స్థానిక మంగళగిరిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్, ఎస్సీ ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జరిగే ఉత్సవాల్లో భాగంగా.. ఈనెల నాలుగో తారీఖు నుండి 14వ తారీకు వరకు మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌బి మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు బుధవారం తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో కుల,మత ,వర్గాల, ప్రాంతీయ, వర్ణ, పార్టీ ,బేధాలు లేకుండా అందరినీ కలుపుకొని ఆ మహనీయుల త్యాగఫలాలను ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. నాలుగో తారీఖు నుంచి ప్రతి గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్ద పూలమాలలు వేసి ఆ మహనీయులకు నివాళులు అర్పించడం జరుగుతుందని తెలియజేశారు.

డొంక వివాదంపై రైతులతో తహశీల్దార్ల చర్చలు

ప్రజాశక్తి - తెనాలి

రైతులు ఉపయోగించే డొంక మార్గంలో అవాంతరాలను తొలగించేందుకు బుధవారం తెనాలి తహశీల్దార్ కె.వి. గోపాలకృష్ణ, దుగ్గిరాల తహశీల్దార్ ఐ.సునీత రైతులతో చర్చించారు. విజయవాడ చెన్నై రైలు మార్గంలో మూడవ రైల్వే లైన్ ఏర్పాటుతో దుగ్గిరాల-కొలకలూరు మధ్య తరచుగా రైతులు ఉపయోగించే డొంకకు అవాంతరం ఏర్పడింది. దీనికి ప్రత్యామ్నాయంగా రెవెన్యూ రికార్డుల ప్రకారం పాత డొంక మార్గాన్ని రైతులకు చూపించారు. అయితే ఈ మార్గంలో డొంక కొంత ఆక్రమణలకు గురైంది. రైతులు పొలాలకు రాకపోకలు సాగించాలన్నా, వ్యవసాయ ఉత్పత్తులను ఇంటికి చేర్చుకోవాలన్నా డొంక అనివార్యం. ఈ నేపథ్యంలో నలుగురు రైతులతో తాసిల్దార్లు చర్చించారు. దీనిపై తహసీల్దార్లు మాట్లాడుతూ డొంక సమస్య దాదాపుగా ఓ కొలిక్కి వచ్చిందని చెప్పారు. సమావేశంలో రైతులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : కెఎల్ యూనివర్శిటీ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో దత్తత గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని యూనివర్శిటీ విద్యార్థి విభాగాధిపతి సలహా దారులు డాక్టర్ హబీబుల్లాఖాన్ అన్నారు. బుధవారం యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ విభాగం, ఆస్టర్ రమేష్ హాస్పి టల్స్, అమరావతి ఐ హాస్పిటల్, బ్రేసెస్ అండ్ ఫేసెస్ డెంటల్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో తాడేపల్లి మండలంలోని చిర్రావూరులో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో బీపీ, షుగరు, ఈసీజీ, ఎముకలు, గుండె, నేత్ర సమస్యలకు పరీక్షలు నిర హించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు యూని వర్శిటీ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్. ప్రసాద్ తెలి పారు. పోషకాహారం తీసుకోవటం మంచిదన్నారు. శిబిరంలో వైద్య సేవలందించిన డాక్టర్లు దీప్తి, కె.శైలజ, ఎన్.వేణు, ఫణి, భార్గవ్‌ను యూనివర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రోవీసీ డాక్టర్ ఏవీఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త పి.శ్రీకాంత్ రెడ్డి, కె.శ్రీనివాస రావును అభినందించారు.

రాజ్యాంగాన్ని కాల రాస్తున్న బిజెపి - వంత పాడుతున్న టిడిపి, వైసిపి

ప్రజాశక్తి- తాడేపల్లి

భారత రాజ్యాంగ విలువలను బిజెపి కాలరాస్తుందని, మనువాద రాజ్యాంగని తీసుకురావాలని చూస్తుందని సిపిఐ మంగళగిరి నియోజకవర్గం కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల 23వ తేదీ భగత్ సింగ్ వర్ధంతి నుంచి ఈనెల 14వ తేదీ డాక్టర్ బి.ఆర్‌అంబేద్కర్ జయంతి వరకు లౌకిక ప్రజా స్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్త ప్రచార ఆందోళనలో భాగంగా బుధవారం తాడేపల్లిలో మున్సిపల్ కార్యాలయం, బోసు బొమ్మ సెంటర్, ఉండవల్లి సెంటర్, ఉండవల్లి, పెను మాక, ఎర్రబాలెం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మంగళగిరి మండల కార్యదర్శి జి జాన్‌బాబు, తాడేపల్లి సహాయ కార్యదర్శి టి వెంకటయ్య, ఎం డాంగే, రామారావు, జి సాంబిరెడ్డి, సత్య నారాయణ, కాశీం, భాష, శ్యామ్, ప్రశాంత్, ఆలివ్, రాజు పాల్గొన్నారు.



ప్రచారంలో సిపిఐ నాయకులు

శివాలయాన్ని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - పెదకాకాని



మండల కేంద్రమైన పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వర స్వామి వారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వి. జ్యోతిర్మయి దంపతులు బుధవారం దర్శించుకున్నారు. జస్టిస్ పి.వి. జ్యోతిర్మయి దంపతులకు ఆలయ ఉపకమిషనరు, కార్యనిర్వహణాధికారి గోగినేని లీలా కుమార్ సాదర స్వాగతము పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పూజలు అనంతరం నిత్య కళ్యాణ మండప ములో ఆలయ అర్చకస్వాము లు, వేదపండితులు వేద ఆశీర్వచనాలు చేశారు. స్వామి వారి శేషవస్త్రముతో సత్కరించారు.



120వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఏసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు న్యాయంగా తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 120 రోజులకు చేరుకున్నాయి. దీక్షలో ఏ విజయశ్రీ, డి రమణ, శారద, డి సువర్చలాదేవి, వి.లక్ష్మి కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కే స్టీవెన్, కే ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వా నికి పైసా ఖర్చు లేకుండా వందలాదిమంది కార్మికుల సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉన్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిం చారు. ఎన్నికలకు ముందు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన వాగ్దానం మేరకు సిమెంట్ ఫ్యాక్టరీ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎం ఆశీర్వా దం, ఈ నరసింహారావు, టినాగేశ్వరరావు, ఎం సుబ్బా రావు, ఎస్.దేవరాజు, వై యెహోషువ, ఎం శివమ్మ, గుర వయ్య, రమాదేవి, ఈ సారమ్మ, టి దుర్గ భవాని పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాల పంపిణీ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని నివశిస్తున్న పేదలకు మన ఇల్లు-మన లోకేష్ కార్యక్రమం పేరుతో ఈనెల 4వ తేదీ నుంచి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నారు. ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య స్థానిక నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, గోసాల రాఘవ పాల్గొన్నారు.

జంపని డ్రెయిన్ పనులను పరిశీలించిన చైర్‌పర్సన్

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలోని మురుగు నీటిని తరలించే జంపని డ్రెయిన్ పనులను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పరిశీలించారు. స్థానిక చిట్టి ఆంజనేయ స్వామి టెంపుల్ దగ్గర డ్రెయిన్‌లో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న వ్యర్థాలను తొలగించే ప్రక్రియను పరిశీలించిన అనంతరం అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ మాలేపాటి హరిప్రసాద్, హెల్త్ ఆఫీసర్ కె. హెలెన్ నిర్మల, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ కె. సాంబ శివరావు, కె హరీష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుండి పదో తరగతి మూల్యాంకనం


సిద్ధం చేసిన టేబుల్స్

ప్రజాశక్తి-గుంటూరు

పదో తరగతి పరీక్షలు ముగిసిన నేపథ్యంలో నేటి నుండి జవాబు పత్రాలు మూల్యాంకనం ప్రారంభం కానుంది. ఈనెల 3 నుండి 9వ తేదీ లోగా ఏడు రోజుల్లో మూల్యాంకనం ప్రక్రియ ముగిసే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. స్థానిక నగరంపాలెంలోని స్టాల్ గరల్స్ హైస్కూల్ ప్రాంగణంలో మూల్యాంకనం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేసవి దృష్ట్యా ఉపాధ్యాయులకు అసౌర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు డిఇఒ సి.వి.రేణుక తెలిపారు. గుంటూరు జిల్లాకు 1.80 లక్షల జవాబు పత్రాలు వచ్చాయి. వాటి మూల్యాంకనం విధుల కోసం చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు దాదాపు 1268 మందిని నియమించారు.

ఆర్‌విఆర్ జె.సి విద్యార్థులకు ఉద్యోగాలు



ప్రజాశక్తి-గుంటూరు

ఎమ్‌బిఏ విద్యార్థులకు విస్తతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని, ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో నిర్వహణా నైపుణ్యాలు కలిగిన మేనేజ్‌మెంట్ విద్యార్థుల అవసరం పెరుగు తున్నదని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. ఇటీవల కళాశాలలో జరిగిన ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలు పొందిన 9 మంది ఎమ్.బి.ఏ విద్యార్థులను బుధవారం కళాశాల సిబ్బంది అభినందించారు.కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

విజయవంతంగా జిల్లా స్థాయి ఇఎండిపి ఎగ్జిబిషన్



విజేతలకు బహుమతులు అందచేస్తున్న ఉప విద్యాశాఖ అధికారి

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇఎమ్‌డిపి-2025 ఎగ్జిబిషన్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గుంటూరు ఉప విద్యాశాఖాధికారి జి.ఏసురత్నం మాట్లాడుతూ విద్యార్థుల మెదడులో ఉన్న ఆలోచనలకు పదును పెడితే బాల శాస్త్రవేత్తలు తయారవుతారని అన్నారు.పాఠశాలల్లో విద్యార్థుల మధ్య ప్రాజెక్టుల పోటీలు నిర్వహించాలని అన్నారు. స్థానిక సమస్యలకు పరిష్కారాన్ని చూపే విధంగా వినూత్నమైన ప్రాజెక్టులను రూపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమాజ శ్రేయస్సు కోసం విద్యార్థులలో శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించాలని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి షేక్.గౌసుల్ మీరా మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఎగ్జిబిషన్లు నిర్వహించి, వాటిల్లో ఉత్తమ 13 ప్రాజెక్టులను జిల్లా స్థాయి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించినట్లు చెప్పారు. అనంతరం ఈ ప్రదర్శనలో ప్రథమ స్థానంలో నిలిచిన కొలకలూరు జెడ్పీ హైస్కూల్, ద్వితీయ స్థానంలో నిలిచిన ముట్లూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ డి.ఐ ఖాసిం, మండల విద్యాశాఖ అధికారి రాయల సుబ్బారావు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆరాధ్యశర్మ, అకడమిక్ కోఆర్డినేటర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత, పోటీతత్వం పెరగాలి : ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విద్యార్థులలో సృజనాత్మకత, పోటీతత్త్వం పెరగాలని శాసన సభ్యురాలు గల్లా మాధవి పేర్కొన్నారు. బుధవారం గుంటూరులోని పెన్షనర్స్ భవనంలోని హాలులో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అమరావతి ఎడు హబ్ పేరుతో గణితం, విజ్ఞానం, ఇంగ్లీషు, జనరల్ నాలెడ్జ్, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్ విభాగాలల్లో ఆరు రాష్ట్రాల్లో నిర్వహించిన పోటీలలో 20వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో 150 మంది విద్యార్థులను గౌరవించడం, 40 మంది ఉపాధ్యాయులకు గురుదేవోభవ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతు విద్యార్థులకు వ్యాసరచన, డిబేటింగ్ క్విజ్ పోటీలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ విద్యార్థులలో ప్రశ్నించే లక్షణం పెరగాలని, మంచి స్వప్నాలతో గమ్యాలను చేరుకోవడానికి అహర్నిశలు కృషి చేయాలన్నారు. కష్టపడి చదవకుండా ఇష్టపడి చదవాలని ఒప్పు చెప్పే పద్ధతికి స్వస్తి పలికి పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటూ అవగాహన పెంచుకుంటూ విద్యను అభ్యసించాలని కోరారు. అమరావతి ఒలంపియడ్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు డి. లక్ష్మణరావు ఆధ్వర్యంలో విజేతలు 150 మంది విద్యార్థులను, 40 మంది గురువులను అభినందించారు. ప్రముఖ గైనకాలజిస్ట్ ఎన్.వి పద్మిని తదితరులు ప్రసంగించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

బాలికలపై నేరాల నివారణకు పటిష్ట చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, వసతి గహాల్లో 18 ఏళ్లలోపు బాల, బాలికలు, మహిళలపై నేరాలు నివారించేందుకు నిర్దేశించిన ముందస్తు భద్రత, రక్షణ చర్యలు పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలసి బాల, బాలికలు, మహిళలపై నేరాల నివారణకు చేపట్టాల్సిన భద్రత, రక్షణ చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలలో, వసతి గహాల్లో ఉండే విద్యార్థుల భద్రత, రక్షణకు సంబంధించిన అంశాలను సంబంధిత అధికారులు, నిర్వాహకులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్స్ ప్రవేశ మార్గాల వద్ద పర్యవేక్షణ కోసం సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. తల్లిదండ్రులు కాకుండా విద్యార్థుల కోసం వచ్చే ఇతర బంధువుల వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేసుకోవాలన్నారు. విద్యా సంస్థలకు, వసతి గృహాలకు ప్రహరీ గోడలు నిర్మించటంతో పాటు, వాచ్ మెన్‌లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు, కళాశాలలకు, హాస్టల్స్‌కు విద్యార్థులు వచ్చిన తరువాత తిరిగి వారు ఇళ్ళకు వెళ్ళే వరకూ వారికి సంబంధించిన పూర్తి బాధ్యత ప్రధానో పాధ్యాయులు, వార్డెన్లు వహించాలన్నారు. సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక వసతుల సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించేలా సంక్షేమ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని కళాశాల, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్‌ను పోలీస్, ఐసీడీఎస్, మున్సిపల్ అధికారులు ప్రత్యేక టీంగా ఏర్పడి తనిఖీలు నిర్వహించి నివేదికలు అందించాలన్నారు. వసతి గృహాలు ఉన్న ప్రాంతాల్లో వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసి బాలల సంరక్షణ చర్యలు పర్యవేక్షించాలన్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాల, బాలికలపై నేరాలు నియంత్రించడానికి ఘటన జరిగిన తర్వాత చర్యలు తీసుకునే కంటే ముందస్తుగానే కొద్దిపాటి జాగ్రత్త రక్షణ చర్యలతో నేరాలను నివారించవచ్చన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎన్.ఎస్.కె.ఖాజావలి, అడిషనల్ ఎస్పీ జీవీ రమణమూర్తి, డీఎస్పీ సుబ్బారావు, ఆర్‌ఐఓ జీకే జుబేర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె విజయలక్ష్మీ, డీఈఓ సీవీ రేణుకా, ఐసీడీఎస్ పీడీ కెవీహెచ్‌ఎస్ విజయలక్ష్మీ, విభిన్న ప్రతిభావంతులు ఏడీ సువార్త, డీవీఈఓ జె పద్మా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎస్‌పి సతీష్‌కుమార్

ఆరు రూట్లలో ప్రైవేటు సిటీ బస్సులు

దరఖాస్తులపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో ప్రైవేటు సిటీ బస్సుల రూట్ల అనుమతులకు సంబంధించి బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన ఆర్‌టీఏ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పాల్గొన్నారు. జాతీయ రహదారి వై జంక్షన్ నుంచి పెదపలకలూరు వరకు, ఆర్టీసీ బస్టాండ్ నుండి లాం వరకు, ఆర్టీసీ బస్టాండ్ నుంచి అడవి తక్కెళ్ళపాడు వరకు, పాత గుంటూరు మణి హోటల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు, ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు రెడ్డిపాలెం మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు, గుజ్జనగుండ్ల నుంచి గుండవరం వరకు మొత్తం ఆరు రూట్లలో సిటీ బస్సులు తిప్పుకోవడానికి 54 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటికి సంబంధించి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులు, దరఖాస్తుదారులతో సమీక్షించారు. సిటీ బస్సుల అనుమతులకు సంబంధించి ఆర్టీసీ అధికారులు ఏప్రిల్ 9వ తేదీ నాటికి రిమార్కులు అందించాలని, అనంతరం అనుమతుల మంజూరుకు ఆర్‌టీఏ కమిటీ చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా ఉపరవాణా కమిషనర్ సీతారామిరెడ్డి, ఆర్టీసీ ఆర్.ఎం.కష్ణ కాంత్, ట్రాఫిక్ డిఎస్పి రమేష్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, దరఖాసుదారులు పాల్గొన్నారు.

శంకర్‌విలాస్ బ్రిడ్జి నిడివి కుదించటం సరికాదు : జెఎసి

అదనపు నిధులు సమకూర్చి పాత ప్లాన్ ప్రకారం నిర్మించాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-గుంటూరు

రాబోయే 50 ఏళ్లలో భవిష్యత్ ప్రజల అవసరాలు, బహుళ ప్రయోజనాలను నెరవేర్చే విధంగా శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, చాలీ చాలని నిధులతో తక్కువ నిడివితో నిర్మిస్తే ప్రయోజనం ఉండదని శంకర్ విలాస్ ఫ్లైఓవర్ జెఎసి నాయకులు అన్నారు. బుధవారం జెఎసి నాయకులు గుంటూరులోని ఓ హోటల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం జెఎసి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. డిజైన్‌లో చేయాల్సిన మార్పులపై పౌర సంఘాల అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు ఎల్.ఎస్.భారవి మాట్లాడుతూ ఆర్ఓబికి తాము వ్యతిరేకం కాదని, అది భవిష్యత్‌కు ఉపయోగపడే విధంగా ఉండాలన్నదే తమ అభిప్రాయం అని స్పష్టం చేశారు. గతంలో ప్రకటించిన ప్లాన్‌కు భిన్నంగా, ప్రజల ఆమోదం లేని కొత్త ప్లాన్‌తో అధికార యంత్రాంగం ముందుకు వెళ్లటం సరికాదన్నారు. గతంలో హిందూ కాలేజి సెంటర్ నుండి లాడ్జి సెంటర్ వరకూ నిర్మిస్తామని, ఆర్ఓబి, ఆర్‌యుబి రెండూ నిర్మిస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఇప్పుడు ప్లాన్‌ను పూర్తిగా మార్చేశారన్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు రోజువారీ రాకపోకలు సాగించే ప్రజలకు శంకర్ విలాస్ బ్రిడ్జి ప్రధాన మార్గమన్నారు. శంకర్ విలాస్‌ను మూసివేస్తే మూడు వంతెనలు, ఇతర మార్గాలు ప్రజలు అవసరాలు తీర్చలేదన్నారు. కావున ముందుగా ఆర్‌యుబి నిర్మించి, తర్వాత ఆర్ఓబి నిర్మించాలన్నారు. ప్రస్తుత ట్రాఫిక్ అవసరాల రిత్యా ఆరు లైన్ల నిర్మాణం అవసరం అని చెప్పిన కలెక్టర్, అధికార యంత్రాంగం నాలుగు లైన్లకు తగ్గించటమే కాకుండా, ఆర్‌యుబి కూడా లేకుండా ట్రాఫిక్ అవసరాలు ఎలా తీరుతాయో ప్రజలకు చెప్పాలని కోరారు. జెఎసి నాయకులు పి.వి.మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ప్రజల్లో అనేక అపోహలు ఉన్నాయని, పౌర సంఘాలతో చర్చిస్తే స్పష్టత వస్తుందన్నారు. కానీ అధికార యంత్రాంగం డిపిఆర్ ఆమోదానికి ముందు ప్రజలతో ఎలాంటి చర్చా జరపలేదన్నారు. అలాగే సామాజిక ప్రభావం సర్వే కూడా నిర్వహించలేదన్నారు. 23 అడుగుల సర్వీసు రోడ్డులో ఐదు అడుగులు డ్రైన్‌కు పోతే మిగిలిన రోడ్డులో ట్రాఫిక్ సులభంగా ఎలా వెళుతుందని ప్రశ్నించారు. ఆర్‌యుబి లేకపోతే తూర్పు, పశ్చిమ నియోజకవర్గ ప్రజలు జిజిహెచ్, విద్యాసంస్థలు, హాస్పిటల్స్, ఇతర వాణిజ్య అవసరాల కోసం ప్రజలు రాకపోకలు సాగించటం సాధ్యం కాదన్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని, చరిత్రలో చెప్పుకునే విధంగా ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని, అవసరం అయితే అందుకు అదనపు నిధులు సాధన కోసం కృషి చేయాలని కోరారు. సమావేశంలో జెఎసి నాయకులు అవధానుల హరి, ఎన్.కమలకాంత్, రాధాకృష్ణ, వి.సదాశివరావు, వెంకట్రావు, కె.నళినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జెఎసి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

కలల సాకారానికి క్రమశిక్షణతో కృషి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో తమ కలల సాకారానికి కృషిచేసినప్పుడే ఉన్నత విజయాలు సాధ్యమవుతాయని జిజిహెచ్ పల్మనరీ మెడిసిన్ హెచ్ఒడి ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రఘు అన్నారు. బుధవారం భాష్యం మెయిన్ క్యాంపస్‌లో భాష్యం మెడి ఎయిమ్స్ ఆధ్వర్యంలో జరిగిన కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ రఘు మాట్లాడుతూ ఒత్తిడికి దూరంగా సరైన ప్రణాళికతో దినచర్యను రూపొందించుకుంటే గొప్ప విజయాలు సాధించవచ్చన్నారు. దీనికి విద్యార్థుల కృషితోపాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం తప్పనిసరి అన్నారు. భాష్యం విద్యాసంస్థల వైస్‌ఛైర్మన్ భాష్యం హనుమంతరావు మాట్లాడుతూ నరైన నిద్ర, ఆహారం, వ్యాయామంతోపాటు దినచర్యను ప్రణాళికాబద్ధంగా రూపొందించుకుని అనుకున్న లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. మెడిఎయిమ్స్ ప్రోగ్రాం ద్వారా ఎక్కువ మంది విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించి భవిష్యత్‌లో ఉన్నతమైన వైద్యులుగా రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతుల్ని అలరించాయి.సభకు భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు అధ్యక్షత వహించగా, భాష్యం మెడిఎయిమ్స్ ప్రిన్సిపాల్ సుధ, మెడికల్ ఫౌండేషన్ ప్రోగ్రామర్ డాక్టర్ చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.రఘు